

## ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

11 లో

పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

అధికారులకు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు


# మనం మహబూబ్‌నగర్

వనపర్తి - గద్వాల్ - నాగర్‌కర్నూల్

శనివారం | 17 | అక్టోబర్ | 2026 | పేజీలు: 13


# నెమళ్ల వేట కలకలం!




5 లో

మైత్రి లైఫ్ సైన్సెస్లో వేట జరిగిందనే అనుమానం

నెమళ్లను వేటాడి తిన్నారనే ఆరోపణలు..

అటవీశాఖ విచారణలో ఏమైంది?

కంపెనీలో తనిఖీలు చేసిన అధికారులు.. ఇప్పటికీ తేలని అసలు నిజం!

రాజకీయ ఒత్తిళ్లా? అధికారుల నిర్లక్ష్యమా? బాధ్యులెవరో తేల్చాల్సిందే!

-పాలమూరు, మనం న్యూస్

## ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దుతాం

2 లో

- గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తాం
- ప్రతి కాలనీకి రోడ్డు సౌకర్యం
- తాగునీరు సౌకర్యం
- ప్రతి కాలనీలో వీధిలైట్లు వేయిస్తాం
- ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తాం



## బతుకమ్మ మన ఆత్మగౌరవానికి ప్రతీక



**తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేవి బోనాలు, సమ్మక్క సారక్క, బతుకమ్మ పండుగలు ఎస్పీ సునీతా రెడ్డి**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగలు బోనాలు, సమ్మక్క సారక్క, బతుకమ్మ పండుగలని, ఈ పండుగలు మన ఆత్మగౌరవానికి ప్రతీకలని జిల్లా ఎస్పీ డి. సునీతా రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీతా రెడ్డి మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆడి పాడారు. వేపకాయల బతుకమ్మను వరుసగా పేర్చి, గునుగు పూలను గుత్తుగా పెట్టి, తంగేడు పూలను ప్రధానంగా చేర్చి, తమలపాకులలో గౌరమ్మను ఉంచి బతుకమ్మను అందంగా అలంకరించారు.

3

## జే,ఏ,సీ పేరుతో స్వప్రయోజనాల కోసమే రిలే దీక్షలు

- ఖండించిన డిసిసి ప్రధాన కార్యదర్శి బలరాం గౌడ్
- ఇంటిగ్రేటెడ్ భవనాల కోసం రూ.13 కోట్ల నిధులు
- చారకొండ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే వంశీకృష్ణ కృషి



చారకొండ,అక్టోబర్16(మనం న్యూస్): చారకొండ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని జె,ఎ సి పేరుతో ఒకరిద్దరు నేతల స్వప్రయోజనాల కోసమే రిలే దీక్షలు చేపడుతామని చేసిన ప్రకటనను,డీసీసీ ప్రధాన కార్యదర్శి జమ్మికింది బలరాం గౌడ్ ఖండించారు.శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..చారకొండ మండలం 2016 లో ఏర్పాటు అయితే గత ప్రభుత్వం 7 ఏళ్ళు అధికారంలో ఉండి కూడ ఏమి చేయలేకపోయారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ చారకొండపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మండల కార్యాలయాలు అన్ని ఒకేచోట ఉంటే ప్రజలకు సౌకర్యార్థం ఉంటుందని,మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల సముదాయాల ఏర్పాటుకు రూ.13 కోట్లు ప్రతిపాదించి మంజూరు కూడా చేయించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి 5 ఎకరాలు భూమి కావాల్సి ఉందని,స్థలం సేకరిస్తే పనులు త్వరలోనే ప్రారంభం అవుతుందని తెలిపారు.ఇదే కాకుండా గత ప్రభుత్వంలో బైపాస్ నిర్మించి గ్రామానికి తీరని అన్యాయం చేశారని,కానీ ఎమ్మెల్యే గ్రామంలో నుంచి సెంట్రల్ లైటింగ్ తో నాలుగు వరుసల రహదారి నిర్మించాలనే సంకల్పంతో రూ.56 కోట్లు మంజూరు చేయించడం జరిగిందని,దానికి సంబంధించిన ప్రొసీడింగ్ కూడా వచ్చిందని అన్నారు.గత ప్రభుత్వంలో గ్రామాన్ని అన్ని రంగాల్లో వెనుకబాటుకు గురి చేస్తే ప్రశ్నించని నోర్లు ప్రస్తుతం శాశ్వతమైన అభివృద్ధి పనులు చేయడానికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తుంటే కొంత మంది తమ ఉనికి కోసం ఆరాటపడుతూ అడ్డుకోవడానికి ప్రయత్నాలు చేస్తే ప్రజలు హర్షించరని హితవు పలికారు. జే,ఎ,సి అంటే అన్ని వర్గాలు,అన్ని పార్టీలు భాగస్వామ్యం ఉండాలని కానీ ఒకరిద్దరు మాత్రం తామే జె,ఎ,సి అని ప్రకటించుకుని రిలే దీక్షలు చేయాలనుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే అని అన్నారు.రాజకీయాలకు తావు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి కొరకు పని చేస్తుందని,ప్రభుత్వానికి సహకరించడం పోయి వ్యతిరేకించడం సరికాదని అన్నారు.ఎవరు ఎన్ని కుట్రలు చేసినా మండల ఇంటిగ్రేటెడ్ కార్యాలయ భవనాల నిర్మాణం,గ్రామంలో నుంచి నాలుగు వరుసల రహదారి నిర్మాణం జరుగుతుందని అన్నారు.

## గ్రామంలో మౌలిక వసతులు కల్పిస్తాం

- ప్రతి కాలనీకి రోడ్డు సౌకర్యం
- తాగునీరు సౌకర్యం
- ప్రతి కాలనీలో వీధిలైట్లు వేయిస్తాం
- ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తాం





ఉమ్మడి గోపాలపేట అక్టోబర్,16( మనం న్యూస్ ): మా ఏదుట్ల మేజర్ గ్రామపంచాయతీని జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీల కంటే మా గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామంటూ గ్రామ సర్పంచ్ సునీత రాజ వర్ధన్ రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా గోపాలపేట మండలం మేజర్



ఏదోట్ల గ్రామపంచాయతీలో గ్రామ అభివృద్ధి బాటలో నడుస్తుంది. గ్రామంలో సుమారుగా 5 వేల జనాభా 14 వార్డులు ఉన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామం దిన దినాన అభివృద్ధిమయంగా మారుతుంది. సర్పంచ్ సునీత రాజ వర్ధన్ రెడ్డి ఏకపక్షాన ఉండకుండా 14 వార్డు సభ్యులతో కలిసి గ్రామ సభలు నిర్వహించుకుంటూ సమస్యలను పరిష్కారానికై ముందడుగు వేస్తున్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉండాలని డ్రైనేజీ నిర్మాణాలు సీసీ రోడ్డు నిర్మాణాలు ఇరుకైన కాలనీలలో చెట్లను తొలగించి రోడ్డు వెడల్పు చేయడం వంటి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అంధకారంలో ఉన్న కాలనీలన్నీ ఈ ఇందిరమ్మ రాజ్యంలో వెలుగులోకి తేవాలన్న సంకల్పం గ్రామ సర్పంచు పై దృఢంగా ఉంది జిల్లాలో ఏదుట్ల గ్రామం మొదటి స్థాయిలో కి తీసుకురావడమే మా సంకల్పం అంటూ ముందుకెళ్తున్నారు. గ్రామ సర్పంచ్ ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి ఆటంకాలు లేకుండా పాలన కొనసాగించడం గమనార్హం. 14 వార్డులో ఏ ఒక్క వార్డు ప్రజలకు ఇబ్బందులు లేకుండా వారికి కావలసిన మౌలిక వసతులను కల్పించడమే మా ధ్యేయం అంటూ గ్రామపంచాయతీ సర్పంచ్ కార్యదర్శి కూడా ఏకమై పనులు చేపడుతున్నారు. ఎన్నో ఏళ్ల నుండి చీకటి పడితే చాలు ఇళ్ల నుండి బయటికి రాని పరిస్థితి ఏదుట్ల గ్రామంలో గతంలో ఉండేది.కానీ నూతనంగా ఎన్నికైన సర్పంచ కష్టమైనా సరే ప్రభుత్వంతో ఒప్పించి ప్రజల సౌకర్యాలు తీర్చాలని ప్రతి కాలనీలో వీధి దీపాలు వేసి వెలుగులోకి తీసుకొస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఒకటో వార్డు నుండి 14వ వార్డు వరకు ప్రతి కాలనీలో ముళ్లకంచలు చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రంగా మార్చేయడం అభినందనీయమ ని ప్రజలు చెప్పుకుంటున్నారు తాగునీరు సరఫరా కానీ కాలనీలకు సర్పంచ్ ఆర్డబ్ల్యూ అధికారులతో చర్చించి పైప్లైన్ ద్వారా అందిస్తున్నారు. ప్రతి నెల ఒకసారి కార్మికులతో కలిసి ప్రతి వాటర్ ట్యాంక్ లను శుభ్రం చేయించి బ్లీచింగ్ కూడా వేయిస్తున్నామని సర్పంచ్ తెలిపారు. జెసిబి యంత్రాలతో రోడ్లు గుంతలు కూడిపించి రోడ్డన్నీ శుభ్రం చేస్తున్నారు. ప్రతి కాలనీ సెంటర్ వద్ద హైమాక్స్ లైట్స్ వేసేందుకు సిద్ధం చేస్తున్నామని సర్పంచ్ తెలిపారు. ఇకపోతే మా గ్రామ ప్రజలకుఅందుబాటులో ఉండి వారికి సేవలు అందిస్తామని జిల్లాలో ఏ గ్రామం లో కూడా జరగని కార్యక్రమాలు ఇక్కడ జరిపించి ఆదర్శ గ్రామంగా మా గ్రామాన్ని తీర్చిదిద్దుతామని సర్పంచ్ ధీమా వ్యక్తం చేశారు.

## చొక్కంపేట్లో శ్రీ లక్ష్మీ సమేత తిరుమలనాథ స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

రాజాపూర్, అక్టోబర్ 16(మనం న్యూస్): రాజాపూర్ మండలం చొక్కంపేట్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ శ్రీ శ్రీ స్వయంభు లక్ష్మీ సమేత తిరుమలనాథ స్వామి దేవాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆ స్వయంభు తిరుమలనాథ స్వామివారి ఆశీస్సులు కలగాలని, జడ్చర్ల నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



## నేడు కల్వకుర్తిలో మహాధర్నా



ఉమ్మడి మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో నేడు అక్టోబర్ 17న,కల్వకుర్తి లో జరిగే మహా ధర్నాకు పాలమూరు ప్రజానీకం, ప్రజాసంఘాలు, కులసంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎర్రవల్లి భూ నిర్వాసితులు కోరారు.సేవ్ ఎర్రవల్లి పేరుతో పడుతున్న భూ నిర్వాసితుల నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 319వ రోజుకు చేరాయి. మహా ధర్నాకు బయలుదేరనున్న ఎర్రవల్లి బాధితులు.

- 319వ రోజు ఎర్రవల్లి దీక్షలు

చారకొండ,అక్టోబర్16(మనం న్యూస్): డిండి ఎత్తిపోతల పథకం రద్దుకు డిమాండ్ చేస్తూ

## తీరొక్క పూలతో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- సంప్రదాయబద్ధంగా మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకలు



నాగర్ కర్నూల్ మనం న్యూస్ అక్టోబర్ 16: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శాఖకు చెందిన ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తీరొక్క రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళా ఉద్యోగులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకలు ఉద్యోగుల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి. 'ఏడు బతుకమ్మ తొందరగా రావమ్మ.. మా తల్లి బతుకమ్మ మమ్మల్ని ఆదరించ రావమ్మ' అంటూ బతుకమ్మ పాటలతో కార్యాలయ ప్రాంగణం మార్మోగింది. పూల పండుగైన బతుకమ్మను భక్తిశ్రద్ధలతో కొలుస్తూ, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ సంప్రదాయాన్ని ఉద్యోగులు ఘనంగా చాటిచెప్పారు. బతుకమ్మ, దసరా పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని, ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపే పండుగలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో డివిహెచ్ఓ డాక్టర్ బి. జ్ఞాన శేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) డాక్టర్ ఎస్.ఏ.ఎల్. నరసింహా, పశువైద్యులు డాక్టర్ కల్పన, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ జీవిత, డాక్టర్ నవ్యశ్రీ, డాక్టర్ పల్లవి, డాక్టర్ ప్రణీతతో పాటు పశువైద్య సహాయకులు శ్రావణి, సల్మా, వనజ, లలిత, శైలజ, విజయలక్ష్మి, జ్యోతి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.




▸▸ తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేవి బోనాలు, సమ్మక్క సారక్క, బతుకమ్మ పండుగలు

▸▸ ఎస్పీ సునీతా రెడ్డి

**వనపర్తి, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి):** తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే పండుగలు బోనాలు, సమ్మక్క సారక్క, బతుకమ్మ పండుగలని, ఈ పండుగలు మన ఆత్మగౌరవానికి ప్రతీకలని జిల్లా ఎస్పీ డి. సునీతా రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కేంద్ర కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సునీతా రెడ్డి మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి ఆడి పాడారు. వేపకాయల బతుకమ్మను వరుసగా పేర్చి, గునుగు పూలను గుత్తుగా పెట్టి, తంగేడు పూలను ప్రధానంగా చేర్చి, తమలపాకులలో గౌరమ్మను ఉంచి బతుకమ్మను అందంగా అలంకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... రంగవల్లుల నడుమ బతుకమ్మను ఉంచి 'చిత్తు చిత్తుల బొమ్మ శివుని ముద్దు గుమ్మ' అం టూ ఆడబిడ్డలు చిందులు వేయడం, కోలాటాల సందడితో ఒకరినొకరు ప్రేమగా పలకరించుకోవడం చూడటం ఎంతో ఆనందదాయకమన్నారు. బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఐక్యతను, ఆత్మీయతను పెంపొందిస్తుందన్నారు.జిల్లా పోలీసు సిబ్బంది, అధికారులు, వారి కుటుంబ సభ్యులందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఆరోగ్యంగా, మానసికం గా, శారీరకంగా పటిష్టంగా ఉండాలని, వృత్తిని ప్రేమించి విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏఆర్ వీరారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, డీఎస్పీ గిరిబాబు, సీఐలు ఓడి రమేష్, రత్నం, ఆర్ఐలు అప్పలనాయుడు, శ్రీనివాస కుమార్, ఎస్ఐలు, హెచ్సీలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# నారాయణపేట జిల్లా జేసీబీ డ్రైవర్స్ నూతన కమిటీ ఎన్నిక



▸▸ అధ్యక్షుడిగా బాలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీను ఏకగ్రీవ ఎన్నిక

**నారాయణపేట, అక్టోబర్ 16(మనం న్యూస్ ):** నారాయణపేట ప్రాంతంలోని జేసీబీ డ్రైవర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ముందుకు సాగాలని నూతన కమిటీ అధ్యక్షుడు బాలు, ప్రధాన కార్యదర్శి శ్రీను పిలుపునిచ్చారు. డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేస్తామని వారు తెలిపారు. శుక్రవారం నారాయణపేట పట్టణంలోని స్థానిక భగత్ సింగ్ భవన్లో నారాయణపేట ప్రాంత జేసీబీ డ్రైవర్ల సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి టీయూసీఐ జిల్లా నాయకుడు అబ్దుల్ అధ్యక్షత వహించారు. టీయూసీఐ జిల్లా కార్యదర్శి బోయిన్పల్లి రాము, జిల్లా ఉపాధ్యక్షులు బి. నర్సింహులు, కె. కాశీనాథ్, సహాయ కార్యదర్శి ఎదిరింటి నర్సింహులు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అనంతరం జేసీబీ డ్రైవర్ల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోయిన్పల్లి రాము, అధ్యక్షుడిగా బాలు, ఉపాధ్యక్షుడిగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా శ్రీను, సహాయ కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా శ్రీకాంత్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా ఆనంద్, రామిరెడ్డి, రమేష్ నాయక్, చందపాషా, అంజప్ప, రవి, అశోక్, పాండు, అనిల్, రాజు, ఇర్ఫాన్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ జేసీబీ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. డ్రైవర్ల హక్కుల పరిరక్షణతోపాటు, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. డ్రైవర్లందరూ సంఘటితంగా ఉంటూ కమిటీకి సహకరించాలని కోరారు.

# నేడు గోకారంలో భూ-రీ-సర్వే గ్రామసభ

**చారకొండ,అక్టోబర్16(మనం న్యూస్):** నేడు అక్టోబర్ 17న,గోకారం రెవెన్యూ పరిధిలోని గోకారం,చంద్రాయన్ పల్లి గ్రామాలలో భూ-రీ-సర్వే ప్రక్రియలో భాగంగా గోకారం రైతు వేదిక భవనంలో ఉదయం 10 గంటలకు గ్రామ సభ నిర్వహించడం జరుగుతుందని జిపిఓ ఆంజనేయులు తెలిపారు.ఈ గ్రామ సభకు తాసిల్దార్ఉమ,రెవెన్యూఅధికారులు,సర్వేయర్,జిల్లాస్థాయి అధికారులు పాల్గొనున్నారు.కనుక ఇరు గ్రామాల సర్పంచ్ లు,రైతులు,ప్రజలు పాల్గొని గ్రామసభను విజయవంతం చేయాలని కోరారు.



# ప్రజలకు వైద్య సేవలు.. ఉద్యోగులకు అభద్రతా..?

▸▸ ఎన్హెచ్ఎం ఉద్యోగుల వంటా వార్పు

▸▸ నాలుగో రోజుకు చేరిన రిలే దీక్షలు



**నారాయణపేట, అక్టోబర్ 16:** జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్హెచ్ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడంతోపాటు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఎన్హెచ్ఎం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి నారాయణపేట జిల్లాలో నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని వివేకానంద పార్క్ వద్ద ఎన్హెచ్ఎం ఉద్యోగులు వంటా వార్పు నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానానికి స్వస్తి పలకాలి

ఈ సందర్భంగా నిరసనకు మద్దతు తెలిపిన వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఎన్హెచ్ఎం ఉద్యోగులు ఇప్పటికీ కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానాల్లో అభద్రత మధ్య పనిచేయాల్సి రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ ఉద్యోగుల జీవితాల్లో ఆశించిన మార్పు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఎన్హెచ్ఎం ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు వైద్య సేవలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి ఉద్యోగులకు సరైన గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కుటుంబాలను పోషించుకునేందుకు తగిన వేతనాలు చెల్లించాలని కోరారు.

## మహిళా ఉద్యోగులకు 180 రోజుల ప్రసూతి సెలవులు కల్పించాలి

ఎన్హెచ్ఎం పరిధిలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను తప్పనిసరిగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, వారి హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులకు ఆర్థిక భరోసాతోపాటు ఆరోగ్య భద్రత కల్పించాలని, దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎన్హెచ్ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## నిరసనలకు పలు సంఘాల మద్దతు

ఎన్హెచ్ఎం ఉద్యోగులు చేపట్టిన రిలే దీక్షలకు పలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం తరఫున డాక్టర్ సాయిరాం, డాక్టర్ సత్యప్రకాష్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి ఉద్యోగ సంఘం తరఫున డాక్టర్ బాలాజీ, సత్యనారాయణ సంఘీభావం ప్రకటించారు. అలాగే పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, టీఎన్జీఓ చైర్మన్ నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు ఉదయ్ భాను, విజయకుమార్, యూటీఎఫ్ నాయకులు బాలాజీ, భీమయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గోవిందరాజులు, కార్యదర్శి బలరాం తదితరులు ఎన్హెచ్ఎం ఉద్యోగుల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్హెచ్ఎం యూనియన్ గౌరవ అధ్యక్షుడు బిక్షపతి, అధ్యక్షుడు ప్రసాద్, కోశాధికారి రాఘవేందర్, డాక్టర్ నరసింహారావు సగరి, శ్రీలత, వెంకటరమణ, అనురాధ, తిరుపతి, కిరీటి, విరోజ, చందన, శ్వేతశ్రీ, పుష్ప, సరస్వతి, డీడీఎం స్నేహలత, డీఏఎం మమత తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానప్రదాయినిగా శారదాంబ దర్శనం

▸▸ ఉప్పునుంతలలో ఘనంగా సరస్వతీ దేవి పూజలు



**ఉప్పునుంతల, అక్టోబర్ 16 (మనం న్యూస్):**దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు మండల వ్యాప్తంగా అత్యంత వైభవోపేతంగా, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజైన శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో జగన్మాత జ్ఞానస్వరూపిణి అయిన శ్రీ సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చేతిలో వీణ, పుస్తకం, జపమాలను ధరించి దర్శనమిచ్చిన చదువుల తల్లిని దర్శించుకునేందుకు ఆలయాలు, పూజా మండపాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని చారిత్రక శివాలయం ఆవరణలో, కోట బురుజు సమీపంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో కొలువుదీర్చిన దేవీ మండపాలలో ప్రత్యేక అర్చనలు, కుంకుమార్చనలు, వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్థానిక మహిళలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నారులు, విద్యార్థులు చదువుల్లో రాణించాలని కోరుతూ పుస్తకాలను అమ్మవారి పాదాల చెంత ఉంచి పూజలు చేయించారు. అదేవిధంగా మండల పరిధిలోని వెల్టూరు, కంసానిపల్లి, పెనిమెళ్ళ, లక్ష్మాపూర్ తదితర గ్రామాలలోని దుర్గామాత మండపాలలో ఉదయం నుంచే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి, భక్తిశ్రద్ధలతో మహామంగళహారతి ఇచ్చారు. పూజా కార్యక్రమాలు పూర్తయిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా పల్లెలు, పురవీధులు భక్తి నినాదాలు, మంగళవాయిద్యాలతో మార్మోగాయి.

# క్రీడలతో యువతలో నూతన ఉత్సాహం

▸▸ క్రికెట్ పోటీలను ప్రారంభించిన సర్పంచ్

**కొత్తకోట,అక్టోబర్ 16 (మనం న్యూస్):**మండల పరిధిలోని సంకిరెడ్డిపల్లి గ్రామంలో యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో క్రికెట్ పోటీలను గ్రామ సర్పంచ్ సమ్రిన్ ముస్తఫా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, యువత క్రీడల్లో రాణిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.యువతే గ్రామ భవిష్యత్తు, క్రీడలే ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు.



# రోడ్డు భద్రతకు పటిష్ట చర్యలు చేపట్టాలి




**ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు**

**అత్యవసర వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి**

**అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి**

**జిల్లా అదనపు కలెక్టర్ శ్రీను**

**నారాయణపేట, అక్టోబర్ 16(మనం న్యూస్):** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, రహదారులపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, ప్రమాద బాధితులకు సకాలంలో అత్యవసర వైద్య సేవలు అందించడంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు. ప్రజల ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, రోడ్డు భద్రతకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన రోడ్డు భద్రత సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చూడటంతోపాటు, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి తగిన భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు పోలీసు, మున్సిపల్, రోడ్డు మరియు భవనాల శాఖ, రవాణా శాఖ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

### రహదారులపై అడ్డంకులు తొలగించాలి

మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులు, ఇతర మార్గాల్లో వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా విస్తరించిన చెట్ల కొమ్మలను తొలగించాలని అదనపు కలెక్టర్ సూచించారు. రహదారులపై ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట్ల వేగ నిరోధకాలు ఏర్పాటు చేయడంతోపాటు హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. రహదారులపై ప్రయాణించే వాహనదారులకు ప్రమాదాలపై ముందస్తు సమాచారం అందేలా తగిన సూచికలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియంత్రణను మరింత పటిష్టం చేయాలని, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణను పెంచాలని సూచించారు. ముఖ్యంగా నో పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్కు అంతరాయం కలిగించే వాహనాల నిలుపుదలను నియంత్రించాలని తెలిపారు. ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు బస్టాండ్లు, బస్స్టాప్లు లేని ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట్ల వాటిని ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా..

జాతీయ రహదారులు, గ్రామీణ రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి, వాటిని ప్రమాదకర ప్రాంతాలుగా పరిగణిస్తూ నివారణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ తెలిపారు. రహదారుల నిర్మాణం, మలుపులు, వాహనాల వేగం, ట్రాఫిక్ రద్దీ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రమాదాలకు కారణమయ్యే పరిస్థితులను తొలగించాలని సూచించారు. గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు రోడ్డు మరియు భవనాల శాఖ, రవాణా శాఖ, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి జిల్లాలోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించినట్లు సమావేశంలో వివరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

### అంబులెన్సుల రాకపోకలకు ఆటంకాలు ఉండకూడదు..

జిల్లాలోని వైద్య కళాశాల ప్రవేశ మార్గాల్లో చెట్ల కొమ్మలు, ఇతర అడ్డంకులు లేకుండా చూడాలని అదనపు కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించే అంబులెన్సులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. అంబులెన్సులు వేగంగా ఆసుపత్రులకు చేరుకునేందుకు రహదారుల పరిస్థితులను మెరుగుపరచడంతోపాటు, అత్యవసర వాహనాల రాకపోకలకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి సకాలంలో వైద్య సహాయం అందించడం అత్యంత కీలకమని ఆయన అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో అత్యవసర వైద్య సేవలు అందించే ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షించాలని వైద్యాధికారులకు సూచించారు. ప్రమాద బాధితులకు అందించే చికిత్స, అత్యవసర వైద్య సదుపాయాలు, అంబులెన్సు లభ్యతపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. పీఎం రాహత్ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

### విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి...

పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. విద్యాసంస్థల సమీపంలో నో హార్న్ జోన్లు, నో స్మోకింగ్ జోన్లకు సంబంధించిన నిబంధనలను అమలు చేయడంతోపాటు, రోడ్డు భద్రతా నియమాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, నిర్ణీత వేగ పరిమితుల్లో ప్రయాణించడం, హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు ఉపయోగించడం వంటి భద్రతా చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ దిశగా సంబంధిత శాఖలు ప్రజలకు అవగాహన కల్పించేందుకు సమన్వయంతో కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

### బ్లాక్ స్పాట్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

సమావేశం ప్రారంభంలో రోడ్డు మరియు భవనాల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకట రమణయ్య గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు నిర్వహించిన సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను వెల్లడించారు. ఆర్ అండ్ బీ, రవాణా, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు కలిసి జిల్లాలోని ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించి గుర్తించిన బ్లాక్ స్పాట్ల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశంలో ప్రదర్శించారు. గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఆయా ప్రాంతాల్లో అవసరమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లో అవసరమైన మార్పులు చేపట్టడం, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, ఇతర రహదారి భద్రతా చర్యలు అమలు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేస్తామని వివరించారు.

### అన్ని శాఖల సమన్వయంతోనే ప్రమాదాల నివారణ..

రోడ్డు భద్రతకు సంబంధించిన సమస్యలను గుర్తించడమే కాకుండా, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు వెళ్లాలని అదనపు కలెక్టర్ శ్రీను సూచించారు. ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికారులు, రోడ్డు మరియు భవనాల శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రవాణా శాఖ అధికారులు తమ పరిధిలోని సమస్యలపై దృష్టి సారించి సమన్వయంతో చర్యలు చేపట్టాలని తెలిపారు. రహదారులపై ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడటంతోపాటు, ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాల రక్షణకు రోడ్డు భద్రత అత్యంత ప్రాధాన్యమైన అంశమని, ఈ విషయంలో ఏ శాఖ నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ ఎం.డి. రియాజ్ ఉల్ హక్, ఆర్టీఓ మెంబర్ పోషల్ రాజేష్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంపత్ కుమార్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మల్లికార్జున్, ఆర్టీఓ మున్నీ, పీఆర్ ఈఈ అశోక్ కుమార్, డీఈఓ గోవిందరాజులు, ఆర్టీసీ డిపో మేనేజర్ యాకన్న, రోడ్డు మరియు భవనాల శాఖ ఏఈలు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# జనాభా గణనలో స్వీయ గణనతో కచ్చితమైన వివరాల సేకరణ

- **ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి**
- **సమయపాలనతో ప్రక్రియను పూర్తి చేయాలి**
- **రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హొళ్లికేరి**

**నారాయణపేట, అక్టోబర్ 16(మనం న్యూస్):** జనాభా గణనలో స్వీయ గణన విధానం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించి, సమయాన్ని ఆదా చేయడంతోపాటు నాణ్యమైన, కచ్చితమైన సమాచారాన్ని సేకరించాలని తెలంగాణ రాష్ట్ర సెన్సస్ ఆపరేషన్స్ డైరెక్టర్ భారతి హొళ్లికేరి సూచించారు. సెన్సస్ ఆఫ్ ఇండియా-2027 జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్దేశించిన మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం నారాయణపేట జిల్లా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులకు జనాభా గణన రెండో దశపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి భారతి హొళ్లికేరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనాభా గణనలో స్వీయ గణనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, కుటుంబ సభ్యుల వివరాలను సంబంధిత యాప్లో ముందుగానే నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

### స్వీయ గణనతో సమయం ఆదా..

స్వీయ గణన విధానంలో కుటుంబ సభ్యుల వివరాలను ప్రజలే ముందుగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని భారతి హొళ్లికేరి తెలిపారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత గణన అధికారులు సంబంధిత కుటుంబాలను సందర్శించి, నమోదు చేసిన వివరాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైన చోట వివరాలను ధ్రువీకరించి, సందేహాలను నివృత్తి చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ విధానం ద్వారా గణన సిబ్బందిపై పని భారం తగ్గడంతోపాటు ప్రజల సమయం కూడా ఆదా అవుతుందని వివరించారు. జిల్లాలో సుమారు 6.5 లక్షల జనాభాను దృష్టిలో ఉంచుకొని, నిర్ణీత సమయంలో స్వీయ గణన లక్ష్యాలను సాధించేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర శాఖల సిబ్బంది సహకారంతో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు. స్వీయ గణన ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం పెరిగేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### క్షేత్రస్థాయి పరిశీలనతో కచ్చితమైన సమాచారం..

గతంలో నిర్వహించిన గృహాల జాబితా తయారీ ప్రక్రియలో సేకరించిన వివరాలను ప్రామాణికంగా తీసుకొని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని భారతి హొళ్లికేరి సూచించారు. జనాభా పెరుగుదల, కొత్తగా నిర్మించిన ఇళ్లు, వలసలు, గతంలో నమోదు కాని నివాసాలు, సంస్థాగత గృహాలు, ఖాళీ ఇళ్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు.క్షేత్రస్థాయిలో




గుర్తించిన వివరాలను నిర్దేశించిన నమూనాలో నమోదు చేయాలని, గతంలో సేకరించిన సమాచారానికి ప్రస్తుత పరిస్థితులకు మధ్య ఉన్న వ్యత్యాసాలను గుర్తించి సరిదిద్దాలని సూచించారు. జనాభా గణనలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

### గణన బ్లాకుల ఏర్పాటులో జాగ్రత్తలు..

ప్రతి గృహాల జాబితా బ్లాక్ పరిధిలోని జనాభాను అంచనా వేసి, అవసరమైన చోట మాత్రమే బ్లాకుల విభజన చేపట్టాలని రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ సూచించారు. .జనాభా వివరాలు, మ్యాపులు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా గణన బ్లాకులను ఏర్పాటు చేయడంతోపాటు, వాటికి జనాభాను కేటాయించే ప్రక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. జనాభా గణన విజయవంతంగా నిర్వహించడంలో సమన్వయం, కచ్చితత్వం, సమయపాలన కీలకమని ఆమె స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది మార్గదర్శకాలను పూర్తిగా అధ్యయనం చేసి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తూ, సమాచార సేకరణలో పారదర్శకత, నాణ్యత పాటించాలని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రియాంక, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, సీపీఓ భాషా వాహన్, జిల్లా సెన్సస్ అధికారులు, ఛార్జ్ క్లర్కులు, సాంకేతిక సహాయకులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మైత్రి లైఫ్ సైన్సెస్లో నెమళ్ల వేట కలకలం!



▶▶ నెమళ్లను వేటాడి తిన్నారనే ఆరోపణలు.. అటవీశాఖ విచారణలో ఏమైంది?

▶▶ కంపెనీలో తనిఖీలు చేసిన అధికారులు.. ఇప్పటికీ తేలని అసలు నిజం!

▶▶ రాజకీయ ఒత్తిళ్లా? అధికారుల నిర్లక్ష్యమా? బాధ్యులెవరో తేల్చాల్సిందే!

**పాలమూరు, అక్టోబర్ 16 (మనం న్యూస్):** జాతీయ పక్షి నెమలికి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఎవరిది? వన్యప్రాణుల సంరక్షణ చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? నెమళ్లను వేటాడి తిన్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చినా, ఇప్పటివరకు అసలు నిజం బయటపడకపోవడానికి కారణమేంటి? మహబూబ్నగర్ జిల్లా రాజాపూర్ మండల పరిధిలోని చినివెల్లి శివారులో ఉన్న మైత్రి లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి సంబంధించి వినిపిస్తున్న ఆరోపణలు ఇప్పుడు పలు ప్రశ్నలకు తావిస్తున్నాయి. నెమలి భారతదేశ జాతీయ పక్షి. దానికి హాని చేయడం, వేటాడటం, చంపడం వంటి చర్యలు తీవ్రమైన చట్టపరమైన పరిణామాలకు దారితీస్తాయి. అలాంటి జాతీయ పక్షికి సంబంధించిన వేట ఆరోపణలు ఒక పరిశ్రమ పరిసరాల్లో వినిపించడం సాధారణ విషయం కాదు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## అసలేం జరిగింది?

విశ్వసనీయ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం.. కొన్ని రోజుల క్రితం మైత్రి లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్లో పనిచేస్తున్న బీహార్, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కొందరు కార్మికులు నెమళ్లను వేటాడి కంపెనీ పరిసరాలకు తీసుకొచ్చి తిన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయం బయటకు పొక్కడంతో సంబంధిత కార్మికులు అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ ఆరోపణలకు సంబంధించి ఇప్పటివరకు బహిరంగంగా ధ్రువీకరించిన ఆధారాలు అందుబాటులో లేవు. కార్మికులు నిజంగానే నెమళ్లను వేటాడారా? వేటాడినట్లు చెబుతున్న పక్షులు ఎక్కడి నుంచి వచ్చాయి? ఈ ఘటనలో ఎవరెవరి పాత్ర ఉంది? అనే ప్రశ్నలకు అధికారిక విచారణ ద్వారానే సమాధానాలు రావాల్సి ఉంది.ఆరోపణలు వినిపించడం ఒక ఎత్తయితే.. వాటి వెనుక ఉన్న నిజానిజాలను తేల్చడం మరో ఎత్తు.

## అటవీశాఖ తనిఖీలు.. అయినా తేలని నిజం!

ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు మైత్రి లైఫ్ సైన్సెస్ కంపెనీకి వెళ్లి తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది. అక్కడ పనిచేస్తున్న వారిని విచారించినప్పటికీ, ఇప్పటివరకు ఈ ఘటనకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు లభించలేదని ఓ అటవీశాఖ అధికారి తెలిపినట్లు సమాచారం.కంపెనీలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు కూడా అటవీశాఖ అధికారులను కలిసి తమకు తెలిసిన విషయాలను వివరించినట్లు ప్రచారం జరుగుతోంది.అయితే, ఇంతటి తీవ్రమైన ఆరోపణలు వెలుగులోకి వచ్చినప్పుడు కేవలం ప్రాథమిక తనిఖీలతోనే సరిపెట్టాలా? ఘటన జరిగినట్లు చెబుతున్న ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించారా? అక్కడ పనిచేస్తున్న కార్మికుల వివరాలను సేకరించారా? వారు ఎక్కడికి వెళ్లారనే విషయంపై ఆరా తీశారా? కంపెనీలో అందుబాటులో ఉన్న సీసీటీవీ దృశ్యాలను పరిశీలించారా? అనే ప్రశ్నలు ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి.ఈ అంశాలపై అటవీశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## నెమలి ఈకలు ఎవరు తెచ్చారు?

## ఎక్కడి నుంచి వచ్చాయి?

ఈ వ్యవహారంలో మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చినట్లు సమాచారం. కంపెనీలో ప్రస్తుతం పనిచేస్తున్న కొందరు వ్యక్తులు.. తమపై అనుమానాలు వ్యక్తం చేయవద్దని, నెమలి ఈకలను ఇతరులు తెచ్చి అక్కడ పెట్టి ఉండవచ్చని, లేదా కుక్కలు ఎక్కడి నుంచైనా తీసుకొచ్చి పడేసి ఉండవచ్చని అధికారుల విచారణలో చెప్పినట్లు ఓ అధికారి ద్వారా సమాచారం అందుతోంది. అయితే, ఈ వాదనలకు సంబంధించి స్వతంత్రంగా ధ్రువీకరించిన ఆధారాలు లేవు. నెమలి ఈకలు అక్కడికి ఎలా వచ్చాయి? అవి నిజంగా నెమళ్లకు సంబంధించినవేనా? వాటిని ఎవరు, ఎప్పుడు అక్కడికి తీసుకొచ్చారు? ఏదైనా వన్యప్రాణికి హాని జరిగిందా? జరిగితే దానికి బాధ్యులెవరు? అనే అంశాలను శాస్త్రీయ ఆధారాలతో పరిశీలించాల్సిన అవసరం ఉంది. అనుమానాలను ఆధారాలుగా పరిగణించలేం.. అలాగే ఆధారాలు సేకరించకుండానే ఆరోపణలను కొట్టిపారేయలేం. నిజం తేల్చాల్సిన బాధ్యత విచారణ అధికారులదే!

## ఇంతటి ఆరోపణలు బయటకు రాకపోవడానికి కారణమేంటి?

ఈ వ్యవహారం గురించి స్థానికంగా చర్చ జరుగుతున్నప్పటికీ, ఇప్పటివరకు పూర్తి వివరాలు బహిరంగంగా వెల్లడికాకపోవడంపై పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జాతీయ పక్షికి సంబంధించిన వేట ఆరోపణలు సాధారణమైనవి కావు. ఇలాంటి ఘటనలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేయడం, విచారణ పురోగతిపై అధికారిక సమాచారం అందించడం అవసరం.ఈ వ్యవహారంలో నిజంగానే వన్యప్రాణుల వేట జరిగి ఉంటే, బాధ్యులను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలి. అలాంటి ఘటన జరగలేదని విచారణలో తేలితే, అనుమానాలకు తావులేకుండా వాస్తవాలను వెల్లడించాలి.రెండు సందర్భాల్లోనూ పారదర్శకతే కీలకం.

## రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా? ప్రజల్లో వినిపిస్తున్న ప్రశ్నలు!

ఈ ఘటనకు సంబంధించి చర్యలు ఎందుకు స్పష్టంగా కనిపించడం లేదనే ప్రశ్నతో పాటు, అధికారులపై ఏమైనా రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లు ఉన్నాయా? అనే అనుమానాలను కొందరు వ్యక్తం చేస్తున్నారు. అయితే, రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే ఆరోపణలకు ఇప్పటివరకు నిర్ధారిత ఆధారాలు లేవు. కాబట్టి వాటిని వాస్తవాలుగా పరిగణించడం సరికాదు.అయినప్పటికీ, ఈ వ్యవహారంలో ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా నిష్పక్షపాతంగా విచారణ జరుగుతోందని అటవీశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలి. విచారణలో జాప్యానికి కారణాలుంటే వాటిని వెల్లడించాలి. ఆరోపణలు నిజమని తేలితే ఎవరినీ ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలి. చట్టం ముందు అందరూ సమానమే. ఒకరు కార్మికుడైనా, కంపెనీ ఉద్యోగైనా, యాజమాన్యానికి చెందిన వ్యక్తైనా.. చట్టాన్ని ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే బాధ్యత వహించాల్సిందే.

## కంపెనీ యాజమాన్యం బాధ్యత ఏమిటి?

పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతతో పాటు, కంపెనీ ప్రాంగణంలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరగకుండా తగిన పర్యవేక్షణ ఉండటం కూడా ముఖ్యం.అయితే, కంపెనీ ప్రాంగణంలో ఆరోపణలు వినిపించాయనే కారణంతో యాజమాన్యానికి నేరంలో ప్రమేయం ఉందని నిర్ధారించలేం. అదే సమయంలో, ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలికితీసేందుకు కంపెనీ యాజమాన్యం విచారణకు సహకరించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో కంపెనీలో సీసీటీవీ రికార్డులు అందుబాటులో ఉన్నాయా? సంబంధిత రోజుల్లో విధుల్లో ఉన్న కార్మికుల వివరాలు ఏమిటి? అటవీశాఖ విచారణకు యాజమాన్యం ఎలాంటి సహకారం అందించింది? వంటి అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.వన్యప్రాణుల సంరక్షణ చట్టం ఏం చెబుతోంది?భారతదేశ జాతీయ పక్షి అయిన నెమలి వన్యప్రాణుల సంరక్షణ చట్టం, 1972 పరిధిలో రక్షణ పొందుతుంది. నెమలిని వేటాడటం, చంపడం లేదా చట్టవిరుద్ధంగా దాని అవశేషాలను కలిగి ఉండటం వంటి చర్యలు వర్తించే చట్ట నిబంధనల ప్రకారం నేరాలుగా పరిగణించబడవచ్చు.అయితే, ఈ ఘటనలో ఏదైనా నేరం జరిగిందా? జరిగితే ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘించారా? అనేది ఆధారాలు, విచారణ ఫలితాల ఆధారంగానే నిర్ధారించాలి.నేరం నిర్ధారణ కాకముందే ఎవరినీ దోషిగా ప్రకటించలేం. అదే సమయంలో, వన్యప్రాణులకు హాని జరిగిందనే అనుమానాన్ని నిర్లక్ష్యం చేయడం కూడా సమర్థనీయం కాదు.

## అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించాలి!

ఈ వ్యవహారంపై జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులు దృష్టి సారించి, ఇప్పటివరకు చేపట్టిన విచారణ వివరాలను సమీక్షించాలి. అవసరమైతే ప్రత్యేక బృందంతో విచారణ జరిపించి, అందుబాటులో ఉన్న సాక్ష్యాలను సేకరించాలి.అలాగే, నెమళ్ల వేటకు సంబంధించి విశ్వసనీయ సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతూ, వారి వద్ద ఉన్న సమాచారాన్ని పరిశీలించాలి. ఘటన జరిగినట్లు చెబుతున్న తేదీలు, ప్రదేశాలు, సంబంధిత వ్యక్తుల వివరాలను ధ్రువీకరించాలి.విచారణలో ఎలాంటి ఆధారాలు లభించకపోతే ఆ విషయాన్ని అధికారికంగా వెల్లడించాలి. ఆధారాలు లభిస్తే చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలి.

## తేలాల్సింది ఒక్కటే.. నెమళ్లకు న్యాయం జరిగిందా?

చినివెల్లి శివారులోని మైత్రి లైఫ్ సైన్సెస్ కంపెనీకి సంబంధించి వినిపిస్తున్న నెమళ్ల వేట ఆరోపణలు ప్రస్తుతం విచారణతోనే తేలాల్సిన అంశాలు. ఆరోపణలు నిజమా? కాదా? అనే విషయంపై ఇప్పటివరకు తుది నిర్ధారణ వెలువడలేదు.కానీ ఈ వ్యవహారం లేవనెత్తుతున్న ప్రశ్నలకు మాత్రం సమాధానాలు రావాలి. జాతీయ పక్షి సంరక్షణ విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదు. వన్యప్రాణులకు హాని జరిగితే బాధ్యులను గుర్తించాలి. జరగని నేరాన్ని జరిగినట్లుగా చిత్రీకరించే ప్రయత్నాలుంటే వాటిని కూడా వాస్తవాలతో ఖండించాలి. చట్టం ఎవరికీ చుట్టం కాదు. అధికారుల విధి ఆరోపణలను దాచిపెట్టడం కాదు.. నిజాన్ని వెలికితీయడం. రాజకీయాలు, పలుకుబడి, హోదాలతో సంబంధం లేకుండా ఆధారాలే ప్రామాణికంగా విచారణ జరగాలి. మైత్రి లైఫ్ సైన్సెస్ వ్యవహారంలో అటవీశాఖ తదుపరి చర్యలు ఏమిటి? ఆరోపణలపై ఎలాంటి ఆధారాలు లభించాయి? విచారణ ఎటు దారితీస్తుంది? అన్నది వేచి చూడాలి.ఇప్పుడు ప్రజల ప్రశ్న ఒక్కటే - నెమళ్ల వేట జరిగిందా? జరిగితే బాధ్యులెవరు? జరగకపోతే ఈ ఆరోపణలకు కారణమేంటి? ఈ ప్రశ్నలకు అటవీశాఖ సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది!

# కుమారుడికి ప్రమాదమంటూ సైబర్ కేటుగాళ్ల బురిడీ

▶▶ రూ.60 వేలు కాజేసిన ఘరానా మోసం

▶▶ బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఉప్పునుంతల పోలీసులు

▶▶ అపరిచిత వ్యక్తుల ఫోన్లతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పి.మహేష్ గౌడ్ హెచ్చరిక

**ఉప్పునుంతల, అక్టోబర్ 16 (మనం న్యూస్):** కుమారుడు తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని, అత్యవసర చికిత్స నిమిత్తం నగదు కావాలంటూ నమ్మించి సైబర్ నేరగాళ్లు రూ.60,000 కాజేసిన ఘటన ఉప్పునుంతల మండల పరిధిలో వెలుగుచూసింది. ఈ ఘటనపై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఉప్పునుంతల ఎస్సై పి.మహేష్ గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తాడూరు గ్రామానికి చెందిన బాలుసు తిరుపతయ్యకు ఈ నెల 5వ తేదీన గుర్తుతెలియని మొబైల్ నంబర్ (7981929846) నుంచి ఒక కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి మాట్లాడుతూ.. హైదరాబాద్లో ఉంటున్న మీ కుమారుడు బాలుసు సాయి ప్రకాష్ తీవ్ర రోడ్డు ప్రమాదానికి గురయ్యాడని, ప్రస్తుతం ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రిలో ఉన్నాడని చెప్పాడు. అతడికి తక్షణమే మెరుగైన అత్యవసర వైద్యం అందించాల్సి ఉందని, ఇందుకోసం వెంటనే రూ.60 వేలు పంపాలని నమ్మబలికాడు.కొడుకు ప్రాణాపాయంలో ఉన్నాడనే ఆందోళనతో కంగారుపడిన తిరుపతయ్య, వెంటనే అదే గ్రామానికి చెందిన కుంభం కవిత వద్దకు వెళ్లి పరిస్థితిని వివరించాడు. సైబర్ దుండగుడు సూచించిన 9262889061 అనే మొబైల్ నంబర్కు ఆ మొత్తాన్ని ఆన్లైన్ ద్వారా పంపాల్సిందిగా కోరాడు. తిరుపతయ్య మాటలను నిజమని నమ్మిన కవిత, వెంటనే తన ఖాతా నుంచి సదరు నంబర్కు రూ.60,000 బదిలీ చేసింది. లావాదేవీ పూర్తయిన కాసేపటికి కుమారుడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు సాయి ప్రకాష్కు ఫోన్ చేయగా, తనకు ఎలాంటి ప్రమాదం జరగలేదని, తాను క్షేమంగానే ఉన్నానని సమాధానం ఇచ్చాడు. దీంతో తాము సైబర్ నేరగాళ్ల వలలో పడి మోసపోయామని గ్రహించిన బాధితులు లబోదిబోమన్నారు. బాధితురాలు వెంటనే సైబర్ క్రైమ్ టోల్ఫ్రీ హెల్ప్లైన్ నంబర్ 1930ను ఆశ్రయించి ఫిర్యాదు నమోదు చేయగా, అక్నాలెడ్జ్మెంట్ నంబర్ (33710260052367) జారీ అయింది. అనంతరం బాధితులు శుక్రవారం ఉప్పునుంతల పోలీస్ స్టేషన్లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయగా, గుర్తుతెలియని నిందితులపై కేసు నమోదు చేసి చట్టపరమైన దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై మహేష్ గౌడ్ వెల్లడించారు.

## అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్తో అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై పి.మహేష్ గౌడ్



బంధువులు, పిల్లలు ప్రమాదానికి గురయ్యారని లేదా ఆసుపత్రిలో ఉన్నారని చెప్పి గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి అత్యవసరంగా డబ్బులు డిమాండ్ చేస్తే వెంటనే ఆందోళనకు గురికావద్దు. ముందుగా నిర్ధారించుకోండి: డబ్బులు పంపే ముందు మీ పిల్లలకు గానీ, సంబంధిత వ్యక్తులకు గానీ నేరుగా ఫోన్ చేసి వివరాలను క్షుణ్ణంగా నిర్ధారించుకోవాలి. ₹ ధృవీకరణ లేకుండా నగదు పంపవద్దు: గుర్తుతెలియని వ్యక్తులు సూచించే యూపీఐ (ఖఐ) ఐడీలు, ఫోన్ నంబర్లు లేదా ఖాతాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ డబ్బులు బదిలీ చేయరాదు. ₹ వెంటనే ఫిర్యాదు చేయండి: ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా గోల్డెన్ అవర్లోగా 1930 టోల్ఫ్రీ నంబర్కు కాల్ చేయాలి లేదా రీరీరీ.ఛిడ్భటఛిటజీర్ఖు.జౌ.జీ వెబ్సైట్లో ఫిర్యాదు చేయాలి. తద్వారా నిందితుల ఖాతాల్లోని లావాదేవీలను నిలిపివేసి, పోగొట్టుకున్న డబ్బును తిరిగి రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ కష్టార్జితాన్ని కాపాడుకోవాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కాం(గెస్ (ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం



- పాలనపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రశంసలు
- ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన
- కాటోని గడ్డ తండాలో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన అనిరుధ్ రెడ్డి

**మిడ్జిల్, అక్టోబర్ 16 (మనం న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అద్భుతమైన పాలన అందిస్తోందని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి ప్రశంసించారు. మిడ్జిల్ మండల పరిధిలోని ఈదుల బావి తండా గ్రామ పంచాయతీ కటోని గడ్డ తండాలో శుక్రవారం ఆయన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో పనిచేస్తోందని కొనియాడారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలంతా పూర్తి సంతృప్తితో ఉన్నారని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను మరియు పథకాలను గ్రామీణ ప్రజలంతా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధర్మ నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు మహ్మద్ గౌస్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పశువుల పాలిట ఎల్ నినో కాక..పశువైద్యుడి మేలైన కేక

- పశు వైద్య నిపుణుడు డా,రాజేష్



**ఊరుకొండ అక్టోబర్ 15 (మనం న్యూస్).:** స్థానిక మండల పరిధిలోని శుక్రవారం రబీ కాలంలో ఎల్ ని నో ప్రభావం రైతులపై,పశువుల పై పంజా విసురుతుంది.ఈ నేపథ్యంలో పశు వైద్య వైద్యనిపుణుడు డా, రాజేష్,'మనం' పేపర్ తో ప్రత్యేకంగా సంభాషిస్తూ... మండల వ్యాప్తంగా సంభవిస్తున్న,అనావృష్టికి ఆనవాలు,అతివృష్టికి అపశకునం ఈ 'ఎల్ నినో'.ఆకాశం నుంచి నిప్పుల వర్షం కురుస్తుంటే,అల్లాడిపోయే మూగజీవాల ఆర్తనాదాలు వింటుంటే,ఏ రైతు గుండె అయినా చెరువవుతుంది.ఈ ఏడు ఎల్ నినో ఎండల సెగలు,ఉక్కపోతల తగవులు మన పశుసంపదను పట్టి పీడిస్తున్నాయి.ఇలాంటి కరవు కాలంలో,కష్టాల తీరంలో మన పశువుల ప్రాణాలను కాపాడుకోవడానికి,ముంగిటకు వచ్చి,పశువుల పాలిట కల్పవృక్షమై,కమ్మని మాటలతో,చక్కని సలహాలు ఇచ్చిన మేలైన సూచనల డా, రాజేష్ ఇదిగో,నిప్పుల సెగలకు,నీళ్ల నిధులు.ఎండలు మండుతున్నాయని ఎదలు కోసుకోవద్దు,పశువుల దాహాన్ని మరువవద్దు అంటూ,డాక్టర్ మొదటి సూత్రం చెప్పారు.చన్నీళ్ల విందు.పొద్దున,మధ్యాహ్నం,సాయంత్రా,మూడు పూటలా ముక్కోటి దేవతలుండే గోవులకు,గేదెలకు స్వచ్ఛమైన,చల్లని తాగునీరు అందుబాటులో ఉంచాలి.నిలువెల్లా తడిపి,మండుటెండల్లో పశువులను మలమల మార్చకుండా,రోజుకు రెండు మూడు చన్నీళ్లతో ఒళ్లు తడపాలి.బావుల దగ్గరో,చెరువుల నీడల్లోనో వాటిని సేదతీర్చాలి.ఆశ్రయం అమృతం.రేకుల షెడ్ల పైన ఎండుగడ్డి వేసి,చుట్టూ తడి జనపనార గోనె సంచులు కడితే.లోపల ఏసీ వేసినట్లు చల్లగా ఉంటుంది.మేతల కొరతకు,మిశ్రమ విందు.పచ్చగడ్డి కరువైందని పశువులను వదిలేయకండి,ఊక దంపుడు ముచ్చట్లతో కాలం గడపకండి అంటూ,మేత గురించిన రహస్యాలు చెప్పారు.పోషకాల మోతాదు,పచ్చగడ్డి దొరకని కరవు రోజుల్లో ఎండుగడ్డిని ఊరికే వేయకుండా,కాస్త బెల్లం నీళ్లు,ఉప్పు చల్లి ఇస్తే పశువులు ఇష్టంగా తింటాయి.దాణా మేలైన తోడు,పాలు ఇచ్చే పాడి పశువులకు ఖనిజ లవణాల మిశ్రమాన్ని (మినరల్ మిక్చర్) దాణాలో కలిపి ఇవ్వాలి.ఇది పశువుల రోగనిరోధక శక్తిని పెంచి,పాల దిగుబడి తగ్గకుండా చూస్తుంది.సైలేజ్ సంజీవని,ముందే దాచుకున్న పాతాళ గడ్డి (సైలేజ్) ఉంటే,ఈ ఎల్ నినో కష్ట కాలంలో అది పశువుల పాలిట అమృతాహారమే అవుతుంది.రోగాల బెడదకు,నివారణ కవచం.వ్యాధి వచ్చాక బాధపడటం కన్నా,రాకముందే రక్షణ కవచం వేయడం మిన్న,అని ప్రాసలతో హెచ్చరించారు.టీకాల రక్షణ,గొంతువాపు,జబ్బవాపు వంటి ముసరు రోగాలు ముసురుకోక ముందే పశువులన్నింటికీ సకాలంలో టీకాలు వేయించాలి.నట్టల నివారణ,ఎండ తీవ్రతకు పశువుల పొట్టలో నట్టలు చేరి నీరసించిపోతాయి.అందుకే డాక్టరు సలహాతో ఖచ్చితంగా నట్టల నివారణ మందులు (డీవార్మింగ్) తాగించాలి.ఈగలు,దోమల నిరోధం.షెడ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసి,వేపనూనె తగిన మందులు పిచికారీ చేసి ఈగలు,గోమార్ల బెడద తప్పించాలి.ఎండవేళల్లో వద్దు,ప్రయాణాల జోలి.పొద్దు పొడిచాక తోలద్దు.పొద్దుగూకాక మరవద్దు అంటూ,పశువుల మేత సమయాల గురించి చెప్పారు.పశువులను ఉదయం 10 గంటల లోపే మేతకు తీసుకెళ్లాలి,మళ్లీ సాయంత్రం 4 దాటాకే బయటకు తేవాలి.మధ్యాహ్నం వేళల్లో చెట్ల నీడల్లోనో,చల్లని పాకల్లోనో వాటికి విశ్రాంతినివ్వాలి.ఎండ దెబ్బ (సన్‌స్ట్రోక్) తగలకుండా చూసుకోవడం రైతు ప్రథమ కర్తవ్యం.పశువులే పల్లెటూరి ప్రాణాధారాలు,పాడిపంటలే రైతు రాజుల హృదయ రాగాలు.ఎల్ నినో ఎండలు ఎంతలా మండినా.పశువైద్యాధికారి చూపిన ఈ చక్కని బాటలో,క్రమశిక్షణతో కూడిన పశుపోషణ చేస్తే,మూగజీవాల ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.పల్లెల్లో పాడిసిరి వెల్లివిరుస్తుంది.రైతన్నలారా కదలండి.మీ పశుసంపదను కాపాడుకోండి చక్కని సూచనలు తెలిపారు...

## పారిశుధ్య కార్మికులకు దసరా కానుకలు పంపిణీ




- గ్రామ శ్రేయస్సే ధ్యేయంగా పనిచేస్తాం
- మసిగుండ్లపల్లి సర్పంచ్ గోద శ్రీశైలం

**మిడ్జిల్, అక్టోబర్ 16 (మనం న్యూస్):** మిడ్జిల్ మండల పరిధిలోని మసిగుండ్లపల్లి గ్రామంలో శుక్రవారం పారిశుధ్య కార్మికులకు దసరా కానుకల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గోద శ్రీశైలం, ఉప సర్పంచ్ జనార్దన్ మరియు వార్డు సభ్యుల సమక్షంలో పారిశుధ్య సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి పండుగను పురస్కరించుకుని, గ్రామాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచేందుకు అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల సేవలను గుర్తించి వారిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కార్మికులకు పరిశుభ్రత పనులను మరింత సులభంగా చేసేందుకు అవసరమైన నూతన పనిముట్లతో పాటు, దసరా కానుకగా కొత్త బట్టలను సర్పంచ్, పాలకవర్గ సభ్యులు చేతుల మీదుగా అందజేశారు.

### గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి:

ఈ సందర్భంగా సర్పంచ్ గోద శ్రీశైలం మాట్లాడుతూ... 'గ్రామ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత పారిశుధ్య కార్మికుల చేతుల్లోనే ఉందంటే అతిశయోక్తి కాదు. ప్రతిరోజూ వీధులు శుభ్రం చేస్తూ గ్రామాన్ని రోగాల బారిన పడకుండా కాపాడుతున్న వారి సేవలు వెలకట్టలేనివి,' అని కొనియాడారు. మసిగుండ్లపల్లి గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని, మౌలిక వసతుల కల్పన మరియు గ్రామాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ జనార్దన్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## ప్రాణాలతో చెలగాటం...పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న వాహనాలు!



**ఉప్పునుంతల అక్టోబర్ 16 (మనం న్యూస్) :** గ్రామీణ ప్రాంతాలలో రవాణా సౌకర్యాల కొరత, కొందరు వాహనదారుల నిర్లక్ష్యం వెరసి నిత్యం ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. తాజాగా ఒక గ్రామీణ రహదారిపై కనిపించిన చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే. సాధారణంగా సరుకుల రవాణాకు ఉపయోగించే ఒక చిన్న గూడ్స్ వాహనం వెనుక భాగంలో, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని రోడ్డుపై ప్రమాదకరంగా వెళ్తున్నారు. వాహనం లోపలే కాకుండా, వెనుక భాగంలోని అంచులకు ప్రయాణికులు వేలాడుతూ కూర్చోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఏ చిన్న అజాగ్రత్త జరిగినా లేదా వాహనం అకస్మాత్తుగా బ్రేక్ వేసినా ప్రయాణికులు రోడ్డుపై పడి తీవ్ర ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల నుండి పనుల నిమిత్తం, కూలీల రూపంలో వెళ్లే వారు వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. అటు వాహనదారులు కూడా కేవలం కాసుల కక్కుర్తితో నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు తక్షణమే స్పందించి, తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామీణ ప్రాంతాలకు తగినన్ని బస్సు సౌకర్యాలు కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విజయవంతంగా శ్రీశ్రీశ్రీ స్వయంభు లక్ష్మీ సమేత తిరుమలనాథ స్వామి ఆలయ పునర్నిర్మాణం మరియు గరుడధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠపన మహోత్సవ కార్యక్రమం

- యువనేత శ్రీ చించోడ్ అభిమన్యు రెడ్డి
- పలు సేవా కార్యక్రమాలతో పాటు ఆలయాల నిర్మాణానికి కృషి
- ఈ కార్యక్రమానికి మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణమ్మ , ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు హాజరు



**.రాజాపూర్, అక్టోబర్ 16(మనం న్యూస్)**జడ్చర్ల నియోజకవర్గం రాజపూర్ మండలంలోని చోక్కంపేట్ గ్రామంలో గరుడ, ధ్వజ యంత్ర మరియు మూర్తి ప్రతిష్ఠపన మరియు యాగాన్ని పూర్ణాహుతితో ముగించడమైనది. అనంతరం ఆలయ శిఖర కలశ పూజ చేసి, వేద పండితుల సత్కారం మరియు ఆశీర్వచనము తీసుకోవడం జరిగింది. అ ఆతరువాత తిరుమలనాథ స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మూడురోజులుగా జరుగుతున్న ఆలయ ప్రారంభోత్స కార్యక్రమంలో భాగంగా జడ్చర్ల నియోజకవర్గ స్థాయి లో నిర్వహించిన ఆకాండ భజన పోటీలో గెలుపొందిన టీంలకు మనీ ప్రైజ్ మరియు బహుమతులు అందజేశారు. మూడు రోజులుగా అన్నప్రసాదము కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన వారి ఇరువురికి యువనేత అభిమన్యు రెడ్డి గారు అతిథులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఆ తిరుమలనాథ స్వామి వారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఒక్కరి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని మనస్ఫూర్తిగా కోరుకునట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మహబూబ్ ఎంపీ గారు, జడ్చర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, మాజీమంత్రులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీ లు, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్లు, మాజీ సర్పంచులు, పలువురు ప్రజా ప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామస్తులు తిరుమలనాథ స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి
- పదేండ్ల సమస్యకు పరిష్కారం
- 310 కుటుంబాలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు
- ఆదర్శ్‌నగర్ కాలనీ అభివృద్ధికి రూ.2 కోట్లు.. నగరంలో రూ.603 కోట్లతో భూగర్భ మురుగునీటి వ్యవస్థ



**మహబూబ్ నగర్, 16అక్టోబర్, (మనం న్యూస్ )** పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం మహబూబ్నగర్ పట్టణంలోని క్రిస్టియన్పల్లి, ఆదర్శ్నగర్ ప్రాంతాలకు చెందిన 310 మంది డబుల్ బెడ్రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు , అన్నపూర్ణ గార్డెన్స్లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పేదలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 523 సర్వే నంబర్ పరిధిలో అనేక చిక్కుముడులు ఉన్నప్పటికీ, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించి 310 కుటుంబాలకు ఇళ్లపై చట్టబద్ధమైన హక్కులు కల్పించడం తనకు సంతోషంగా ఉందని అన్నారు. గతంలో డబుల్ బెడ్రూమ్ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అందించినప్పటికీ, సరైన గుర్తింపు పత్రాలు, చట్టబద్ధమైన ధ్రువపత్రాలు లేకపోవడంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని తెలిపారు. ఇళ్లను వారసులకు బదిలీ చేసే విషయంలోనూ సమస్యలు తలెత్తాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎలాంటి న్యాయపరమైన ఇబ్బందులు చిక్కుముడులు రాకుండా అన్ని అంశాలను పరిశీలించి, చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాతే పట్టాలు పంపిణీ చేస్తున్నామని ఆయన వివరించారు. ఈ పట్టాలు కేవలం కాగితాలు కావని, కుటుంబాలకు భద్రత కల్పించే చట్టబద్ధమైన హక్కులని అన్నారు. రాబోయే తరాలు కూడా తమ ఇంటిపై గర్వంగా హక్కు ప్రకటించుకునేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజాప్రతినిధులకు ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగా చూసే నాయకత్వానికి, వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు పనిచేసే నాయకత్వానికి ఎంతో తేడా ఉంటుందని, .మహబూబ్నగర్ నగరంలో గతంలో జరిగిన అక్రమాలు, ఆక్రమణలు, బెదిరింపులు, అక్రమ కేసులకు సంబంధించిన సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ, చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారాలు చూపడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పేదరికానికి కులం, మతం ఉండవని, అన్ని వర్గాల పేదలకు సమానంగా న్యాయం చేయడమే నిజమైన ప్రజాసేవ అని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్నగర్ నగరాన్ని ఒక కుటుంబంగా భావించి, ప్రజలందరి అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. 523 సర్వే నంబర్ పరిధిలోని కాలనీని మహబూబ్నగర్లోనే ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే వెల్లడించారు. ఇళ్ల పట్టాల పంపిణీతోనే తమ బాధ్యత పూర్తికాదని, కాలనీలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం కూడా ప్రభుత్వ బాధ్యతేనని అన్నారు. కాలనీ అభివృద్ధి కోసం త్వరలో రూ.2 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు ప్రకటించారు. కాలనీలో అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల వంటి సదుపాయాలు అందుబాటులో లేని పక్షంలో వాటిని కల్పించేందుకు తక్షణమే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్గారితో చర్చిస్తున్నట్లు వెల్లడించారు. నగర ప్రజలు మురుగునీటి సమస్యలతో అనారోగ్యానికి గురికాకుండా రూ.603 కోట్లతో భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అమలైతే నగరంలో పారిశుద్ధ్య పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మహబూబ్నగర్ను సుందరమైన, ఆదర్శవంతమైన నగరంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన వెనుక విద్య, ఉపాధి, సాగునీరు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయని గుర్తు చేసిన ఆయన , పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, వారు ఉన్నత స్థానాలకు చేరుకునేలా అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల పిల్లల భవిష్యత్తును మెరుగుపరిచేందుకు అవసరమైన నిధులు ఖర్చు చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఆర్అండ్బీ అతిథిగృహం సమీపంలో ప్రతిపాదించిన కూరగాయలు, మాంసాహార మార్కెట్ను మరో అనువైన ప్రాంతానికి తరలించి, ఆ స్థలంలో ఫూలే-అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడేలా రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచే గ్రంథాలయాన్ని నిర్మించాలన్నది తమ లక్ష్యమని తెలిపారు. మహబూబ్నగర్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి రూ.70 కోట్లు మంజూరు చేయించామని, మొదటి దశలో రూ.20 కోట్లతో పనులు ప్రారంభించామని చెప్పారు. ఎంవీఎస్ జూనియర్ కళాశాల పాత భవనాల స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తున్నామని, సుమారు 2,000 మంది విద్యార్థులు నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకునేలా ఆ విద్యాసంస్థను తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. గరల్స్ జూనియర్ కళాశాల కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. నడిగడ్డలోని ఒకేషనల్ కళాశాల అభివృద్ధికి రూ.3 కోట్లు కేటాయించి ఆధునిక సదుపాయాలు కల్పించామని, పక్కనే ఉన్న జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి మరో రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఐటీఐల్లో ఆధునిక సాంకేతిక విద్య అందించేందుకు రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 10 అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లలో రెండింటిని మహబూబ్నగర్కు తీసుకొచ్చామని సుమారు రూ.68 కోట్లతో ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసి, టాటా గ్రూప్ సహకారంతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారిలో సుమారు 95 శాతం మందికి ఉద్యోగావకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు విద్య, జ్ఞానం అత్యంత ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. ఒక కుటుంబం విద్య ద్వారా అభివృద్ధి చెందితే, దానిని చూసి మరో వెయ్యి కుటుంబాలు స్ఫూర్తి పొందుతాయని పేర్కొన్నారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, పారిశ్రామికవేత్తలుగా, ఇతర ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, భవిష్యత్తు తరాలు మెరుగైన జీవితాన్ని గడిపేలా ప్రోత్సహించాలని కోరారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడం, కష్టాల్లో అండగా నిలవడం, పిల్లలకు నాణ్యమైన విద్యను అందించి ఉపాధి అవకాశాలు కల్పించడమే నిజమైన రాజకీయమని అన్నారు. వచ్చే ఎన్నికల గురించి మాత్రమే కాకుండా, వచ్చే తరాల భవిష్యత్తు కోసం పనిచేసే నాయకులే చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. మహబూబ్నగర్ నగర అభివృద్ధికి, పేద ప్రజల సంక్షేమానికి, విద్యార్థుల భవిష్యత్తుకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ క్రిస్టియన్పల్లిలో గత తొమ్మిది, పది సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సమస్యను పరిష్కరించి, అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు అందించడం సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. తెలంగాణ ప్రభుత్వం హౌసింగ్ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు డబుల్ బెడ్రూమ్ ఇళ్లకు సంబంధించిన పెండింగ్ సమస్యలను పరిష్కరించి అర్హులకు న్యాయం చేయాలని నిర్ణయించిందని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లాలో డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఇందులో భాగంగా క్రిస్టియన్పల్లిలో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న సమస్యను పరిష్కరించి, లబ్ధిదారులకు వారి ఇళ్లపై హక్కులు కల్పించగలిగామని పేర్కొన్నారు. లబ్ధిదారులకు అందజేసిన పట్టాలు వారి హక్కులకు నిదర్శనమని, ఇళ్లకు సంబంధించిన సమస్యలు పరిష్కారమై హక్కులు లభించడం ఆనందదాయకమని అన్నారు. లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న సంతోషం జిల్లా యంత్రాంగానికి సంతృప్తినిస్తోందని తెలిపారు. కుటుంబ సభ్యులందరూ ఈ ఆనందంతో బతుకమ్మ, దసరా పండుగలను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్టియన్పల్లిలో ఇంకా ఏవైనా అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంటే జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. పట్టాల పంపిణీ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ సిజే బెనహర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు అజ్మత్ అలి, మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, 10వ డివిజన్ కార్పొరేటర్ రమేష్, తో పాటు ఇతర కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## షాదీఖానా నిర్మాణానికి 39 గుంటల ప్రభుత్వ భూమి కేటాయింపు

- సర్వే నంబర్ 946లో భూమి కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు
- ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వుల ప్రతుల అందజేత



**మహబూబ్ నగర్, 16అక్టోబర్, (మనం న్యూస్ ):** మహబూబ్నగర్ నగరంలో షాదీఖానా నిర్మాణం కోసం సర్వే నంబర్ 946లో 39 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయిస్తూ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. కోయిల్కొండ రోడ్డులోని సదరు సర్వే నంబర్లో షాదీఖానా నిర్మాణానికి భూమి కేటాయింపునకు సంబంధించి ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. కలెక్టర్ కార్యాలయానికి చెందిన ఆర్ఐ సుదర్శన్ రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి విష్ణువర్ధన్ సంయుక్తంగా. శుక్రవారం మహబూబ్నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని కలిసి భూమి కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వుల ప్రతిని అందజేశారు. షాదీఖానా నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయింపుతో నగరంలోని మైనారిటీ వర్గాల ప్రజలకు వివాహాది శుభకార్యాలు నిర్వహించుకునేందుకు అవసరమైన వసతులు కల్పించే దిశగా ముందడుగు పడింది. ఈ కార్యక్రమంలో ఆల్ మేవా అధ్యక్షులు షేక్ ఫరూఖ్ హుస్సేన్, తఖీఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత ఆశీస్సులు ప్రతిఒక్కరిపై ఉండాలి

- రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి

**కల్వకుర్తి అక్టోబర్ 16 (మనం న్యూస్):** దుర్గామాత ఆశీస్సులు ప్రతిఒక్కరిపై ఉండాలని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమీషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ ఉప్పల వెంకటేష్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ,లు ఆకాంక్షించారు.దసరా నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయంలో శ్రీ వాసవి మాత ధనలక్ష్మి దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ సందర్భంగా నవరాత్రుల ఉత్సవ కమిటీ సభ్యులు 55,55,555 రూపాయలతో అమ్మవారిని అలంకరించారు.శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి మాత ఆలయానికి విచ్చేసిన అతిథులను ఆలయ ట్రస్టు చైర్మన్ జూలూరు రమేష్ బాబు,ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్మిచర్ల గోపాల్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం ముఖ్యఅతిథులు మాట్లాడుతూ పవిత్రమైన నవరాత్రి ఉత్సవాలను కల్వకుర్తి పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి మాత ఆలయంలో కులమతాలకు అతీతంగా జరుపుకోవడం గొప్ప విషయం అన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి మాత అమ్మవారు శక్తి స్వరూపిణిగా ఉంటారని ఆశీర్వాదం లభించడం ఎంతో అదృష్టమని అన్నారు.కోరి మొక్కితే కోరికలు తీర్చే దుర్గామాత అందరినీ కరుణించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా నవరాత్రుల ఉత్సవ కమిటీ సభ్యులు ముఖ్యఅతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సూర్య ప్రకాష్ రావు,బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బావండ్ల మధు, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు ఆగిర్ వెంకటేష్,ఆర్యవైశ్య మహాసభ సభ్యులు కొండూరు గోవర్ధన్,మేడిశెట్టి సురేష్,జూలూరు సత్యనారాయణ, ఉప్పు ఆంజనేయులు, శ్రీనివాసులు తో పాటు పట్టణ, మండల ఆర్యవైశ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



# అక్రిడిటేషన్ కార్డుల జారీలో వివక్ష తగదు

- సీఎం సొంత జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల కిరికిరి సిగ్గు చేటు
- అక్రిడిటేషన్ కమిటీ సమావేశం వెంటనే నిర్వహించాలి
- టిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్ డిమాండ్

మహబూబ్ నగర్, 16అక్టోబర్, (మనం న్యూస్ ): మహబూబ్ నగర్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ 4వ సమావేశం వెంటనే ఏర్పాటు చేయాలని, దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంలో వివక్ష తగదని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గండీటి నరసింహులు, జిల్లా కార్యదర్శి మొలకలపల్లి గోపాల్ మహారాజ్, కోశాధికారి ఏముల నరసింహులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు . మహబూబ్ నగర్ జిల్లాలో ఇప్పటి వరకు మూడు విడతలుగా సమావేశాలు నిర్వహించినా కొందరు సీనియర్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు కాలేదని తెలిపారు. సమాచార శాఖ అధికారి తాత్సారం, నిర్లక్ష్యం, మొండి వైఖరి, వివక్షత విధానం కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని ఘాటుగా విమర్శించారు. 'తా పట్టిన కుందేలుకు మూడే కాళ్ళు' అన్న చందంగా వ్యవహరిస్తూ గౌరవ అక్రిడిటేషన్ కమిటీ సభ్యుల అభిప్రాయాలకు విలువ ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు . పెండింగ్ దరఖాస్తుదారులు అందరికీ ఒకే విడతలో ఇవ్వాలని కోరారు. చిన్న పెద్ద పత్రిక చిన్న పెద్ద చానల్ అంటూ వివక్ష సరికాదని అలాగే సమాచార అధికారి తమ పట్ల వివక్ష పాటిస్తున్నారని ఎస్సీ ఎస్టీ జర్నలిస్టులు కొందరు తమ సంఘం దృష్టికి తెచ్చారని తెలిపారు. ఇలాంటి డిస్క్రిమినేషన్ సరికాదని అన్నారు. కనీసం దసరా పండుగ నాటికి దరఖాస్తు చేసుకున్న అందరికీ అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేసి వారిలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు.

### అక్రిడిటేషన్ కార్డులు ఇస్తేనే సరైన వివరణ అవుతుంది

తమ సంఘం తరపున ఈనెల 7న ప్రజావాణి కార్యక్రమంలో అర్హులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ధర్నా కార్యక్రమం నిర్వహించి అనంతరం జిల్లా కలెక్టర్ కమిటీ చైర్మన్ కి వినతి పత్రం సమర్పించామని తెలిపారు. సదరు వినతికి వివరణ ఇవ్వడం మంచిదైనా అర్హులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇస్తేనే సరైన వివరణ అవుతుందని తెలిపారు.

### సీఎం సొంత జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల కిరికిరి సిగ్గు చేటు

రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల పరిధిలో 99శాతం అక్రిడిటేషన్ కార్డులు జారీ చేశారని, గౌరవ సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్ జిల్లాలో నిజమైన జర్నలిస్టులకు నేటికీ అక్రిడిటేషన్ కార్డులు అందకపోవడం దురదృష్టకరమన్నారు. ఇంకా దాదాపు 200 మందికి కార్డులు మంజూరు చేయాల్సి ఉందని తెలిపారు.

### గడువు ముగిసిన బస్సు పాసు

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తీర్పు మేరకు పాత అక్రిడిటేషన్ పై జర్నలిస్టులకు జారీ చేసిన బస్సు పాసు గడువు ఈనెల 15వ తేదీతో ముగిసిందని తెలిపారు. కొత్త కార్డులు జారీ చేసి అందుబాటులోకి వచ్చేవరకు పాత అక్రిడిటేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులకు బస్సు పాసు గడువు మరోసారి పొడిగింపు చేయాలని కోరారు.

### ఫ్రీలాన్స్ కేటగిరీ కోటాను ఉమ్మడి జిల్లాలకు విస్తరించాలి

ఐ పి ఆర్ అక్రిడిటేషన్ వెబ్ సైట్ విండోలో పొందుపరిచిన ఫ్రీలాన్స్ జర్నలిస్టు కోటాను తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల కేంద్రాలకు విస్తరించాలని ఈ సందర్భంగా వారు సమాచార శాఖను డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో నివాసం ఉంటూ జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న సూపర్ సీనియర్ జర్నలిస్టులకు (25 సంవత్సరాల పైబడి) ఫ్రీలాన్స్ కేటగిరీలో అక్రిడిటేషన్ కార్డులు ఇచ్చే విధంగా జీవోను సవరణ చేయాలని కోరారు.

### ఉద్యమ కాలం జర్నలిస్టులకు ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలి

2001 నుండి 2014 వరకు తెలంగాణ ఉద్యమ సమయంలో జర్నలిజంలో కొనసాగి తెలంగాణ స్వతంత్ర ఉద్యమం కోసం పని చేసిన జర్నలిస్టులకు రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత బస్సు పాసు సౌకర్యం కల్పించాలని ఈ సందర్భంగా వారు ప్రభుత్వాన్ని కోరారు.



# జర్నలిస్టులను కించపరిస్తే సహించేది లేదు



- జర్నలిస్టుల ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడతాం
- జర్నలిస్టు సంఘం సభ్యుల హెచ్చరిక

కల్వకుర్తి అక్టోబర్16 (మనం న్యూస్): జర్నలిస్టులను తక్కువ చేసి మాట్లాడినా,అవమానించినా సహించేది లేదని జర్నలిస్టు సంఘం సభ్యులు తీవ్రంగా హెచ్చరించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో జర్నలిస్టుల సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెచ్చి,పాలకులు,అధికారుల దృష్టికి చేర్చే జర్నలిస్టులను ప్రజా ప్రతినిధులు కించపరచడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.సమాజ హితం కోసం నిరంతరం శ్రమించే వారిని అవమానించేలా మాట్లాడటం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు.జర్నలిస్టుల పట్ల గౌరవం లేకుండా ప్రవర్తించే వ్యక్తుల తీరును వారు తీవ్రంగా ఖండించారు. ఇలాంటి చర్యలను చూస్తూ ఊరుకునేది లేదని, అవమానించే వారిపై ఐక్యంగా నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు.ఎండనకా, వాననకా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ ప్రజలకు నిజాలను చేరవేస్తున్న తమను అవహేళన చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

### జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటాం...

జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఎంతవరకైనా పోరాడతామని, అందులో భాగంగా సంబంధిత వ్యక్తులకు చెందిన వార్తల ప్రచురణపై సమిష్టిగా నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జర్నలిస్టులంతా ఒకే తాటిపై నిలబడి,తమ గౌరవానికి భంగం కలిగించే ఎవరినీ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.పత్రికా స్వేచ్ఛను హరించేలా, విలేకరుల విధులకు ఆటంకం కలిగించేలా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు, నాయకులు బాధ్యతా యుతంగా మాట్లాడాలని,విమర్శలు ఉంటే హుందాగా తెలపాలే తప్ప,వృత్తిని కించపరిచేలా వ్యాఖ్యానించకూడదని హితవు పలికారు. ఇటీవల జరిగిన ఓ సమావేశం గురించి వివరణ అడిగిన విలేకరులను అవమానించేలా మాట్లాడిన కల్వకుర్తి మున్సిపాలిటీ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకొని జర్నలిస్టులందరికీ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో తదుపరి కార్యాచరణను ప్రకటించి ఐక్యంగా ఉద్యమిస్తామని ఈ సందర్భంగా జర్నలిస్టులు సంఘం సభ్యులు హెచ్చరించారు.ఈ సమావేశంలో కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు కల్వకుర్తి విద్యార్థులు



- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎంపికల్లో ముగ్గురికి ప్రథమ స్థానం

కల్వకుర్తి రూరల్, అక్టోబర్ 16 (మనం న్యూస్): కల్వకుర్తి విద్యార్థులు కరాటే పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అక్టోబర్ 15న నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎస్జీఎఫ్ఐ ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీల్లో కల్వకుర్తికి చెందిన ముగ్గురు విద్యార్థులు తమ విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు.అండర్-17 విభాగంలో కె. నిరూప్ కుమార్ 66 కేజీల లోపు విభాగంలో, డి. శివ గణేష్ 62 కేజీల లోపు విభాగంలో మొదటి స్థానం సాధించారు. అదేవిధంగా అండర్-14 విభాగంలో డి. హరిచరణ్ 55 కేజీల లోపు విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.ఈ ఎంపిక పోటీలకు తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు అక్టోబర్ 29న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొననున్నారు.రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కరాటే మాస్టర్ వెంకటేష్, కేవీఎస్ ఫౌండర్ జి. గణేష్, తెలంగాణ జనరల్ సెక్రటరీ ఎం.డి. తాజాదిన్ అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఇదే ప్రతిభను కనబరిచి విజయం సాధించి కల్వకుర్తికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల స్థానికులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

# అంగరంగ వైభవంగా నవరాత్రి ఉత్సవాలు



- వీధి దీపాలతో చెన్నకేశవ ఆలయం
- ఆరవ రోజుకు చేరిన అమ్మవారి నవరాత్రులు

గోపాలపేట అక్టోబర్:16( మనం న్యూస్ ) కళకళలాడే వీధి దీపాలతో గోపాలపేట నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వనపర్తి జిల్లా గోపాలపేట మండల కేంద్రంలోని చెన్న కేశవ ఆలయం వద్ద ఏర్పాటుచేసిన కాళికాదేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు నేడు శుక్రవారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ ఉత్సవాలలో శుక్రవారం స్థానిక సర్పంచ్ కర్రోళ్ల స్వప్న భాస్కర్ పాల్గొని అమ్మవారి కార్యక్రమాలు ఎంతో ఘనంగా జరిపించారు. శ్రీ మహాలక్ష్మీ దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మీ దేవికి ప్రత్యేక అలంకరణ చేసి, వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బంగారు, మెరూన్, గులాబీ రంగుల వస్త్రాలతో అలంకరణ చేసి, పాలు, తేనె, క్షీరాన్నం, పూర్ణం బూరెలు తదితర నైవేద్యాలను సమర్పించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో గోపాలపేట సర్పంచ్ కర్రోళ్ళ స్వప్న భాస్కర్, గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. గ్రామంలో నవరాత్రి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ, భక్తి భావాన్ని మరియు ఆధ్యాత్మిక ఐక్యతను చాటుకుంటున్నారు. కార్యక్రమంలో భక్తుడు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాన్ని

# వెలికి తీయడమే ఛాంపియన్స్ కప్ లక్ష్యం



▶▶ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి

వనపర్తి, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి): గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న నైపుణ్యవంతులైన యువ క్రీడాకారులకు వనపర్తి చాంపియన్స్ కప్ - 2026 బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తుందని, గ్రామాల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి టోర్నీలు ఎంతో అవసరమని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనా రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా చరిత్రలో మొట్టమొదటిసారిగా 15 మండలాల క్రీడాకారులతో నిర్వహిస్తున్న వనపర్తి చాంపియన్స్ కప్ - 2026 ను శుక్రవారం వనపర్తి పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఆయన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ డి. సునీతా రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ముందుగా హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి వెలిగించి, క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్య, వయస్సుతో సంబంధం లేకుండా అన్ని మండలాల క్రీడాకారులకు అవకాశం కల్పించాలనే కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆలోచన అభినందనీయమని కొనియాడారు. ఈ టోర్నీలో రాణించే క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పిస్తామని, వనపర్తి మోడల్ ను సంక్రాంతికి రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో కూడా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువత క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి అలవడతాయని అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని పండగ వాతావరణంలో ప్రారంభమైన ఈ క్రీడల్లో క్రీడాకారులందరూ క్రీడాస్ఫూర్తి చాటుతూ గెలుపు కోసం పోరాడాలని, అత్యధిక ట్రోఫీలు గెలిచిన మండలానికి చాంపియన్స్ ట్రోఫీ అందజేస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమని, మైదానంలో ఆడటం వల్ల ఆరోగ్యం, మానసిక ఉల్లాసం చేకూరుతుందని అన్నారు. ప్రారంభోత్సవంలో భాగంగా టగ్ ఆఫ్ వార్ లో శివసేనా రెడ్డి, కలెక్టర్ తాడు లాగి సందడి చేయగా, చెస్ లో ఎత్తుకు పైఎత్తులు వేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు, క్యారమ్స్ లో ఎస్పీ సునీతా రెడ్డి చక్కని ఆటతీరు కనబరిచారు. అనంతరం క్రికెట్ లో కొత్తకోట వర్సెస్ రేవల్లి, వాలీబాల్ లో వనపర్తి వర్సెస్ పానగల్, కబడ్డీలో పానగల్ వర్సెస్ చిన్నంబావి, ఫుట్ బాల్ లో అమరచింత వర్సెస్ గోపాల్ పేట్ జట్ల మధ్య పోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.



## భక్తజన సందోహంతో కిక్కిరిసిన శ్రీ భవానీ శంకర దేవాలయం

▶▶ మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతీ మాతగా అంబా భవానీ దర్శనం



కొత్తకోట, అక్టోబర్ 16 (మనం న్యూస్): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ భవానీ శంకర దేవాలయం శుక్రవారం భక్తజన సందోహంతో కిక్కిరిసింది. నవరాత్రుల్లో ఆరో రోజు, మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ అంబా భవానీ అమ్మవారిని శ్రీ సరస్వతీ మాతగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం కావడంతో భక్తులు తండోపతండాలుగా ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది.ఈ సందర్భంగా పట్టణంలోని రచ్చకట్ట కాలనీకి చెందిన సుమారు వందమంది మహిళా భక్తులు 51 రకాల పిండి వంటకాలతో అమ్మవారికి ప్రత్యేకంగా సారె సమర్పించి తమ భక్తిని చాటుకున్నారు. అలాగే ఆలయ ప్రాంగణం లో సరస్వతి దేవి అవతారంలో ఉన్న అమ్మవారి ముందు వేద బ్రాహ్మణులచే తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు.నేటి పూజా కార్యక్రమాల్లో స్థానిక



ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి దంపతులు,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనా రెడ్డి , స్థానిక చైర్పర్సన్ అరుణ శ్రీనివాస్ మరియు కౌన్సిలర్లు, పట్టణ, మండల నాయకులు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సురేష్ శాస్త్రి, నటరాజు, సదాశివయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి భోజన సౌకర్యం కల్పించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోగాకు అనిల్ కుమార్ ఆయన సోదరులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

# పూల బతుకమ్మలతో పులకించిన జడ్చర్ల మున్సిపాలిటీ!



▶▶ మహిళల ఆటపాటలతో మార్మోగిన ప్రాంగణం.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు!

▶▶ ముఖ్య అతిథిగా జనంపల్లి శశికళ రెడ్డి.. సంప్రదాయాల పరిరక్షణలో మహిళల పాత్ర కీలకం!

పాలమూరు, అక్టోబర్ 16 (మనం న్యూస్) పూలను పూజించే పండుగ.. ప్రకృతిని ఆరాధించే సంప్రదాయం.. ఆడబిడ్డల ఆత్మీయతకు ప్రతీక.. తెలంగాణ ఆడపడుచుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న బతుకమ్మ పండుగ! రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు.. వాటి చుట్టూ చేరిన మహిళలు.. ఒకరి చేతిలో ఒకరు చేయి వేసి పాడిన పాటలు.. లయబద్ధంగా సాగిన ఆటపాటలు.. ఆనందోత్సాహాల నడుమ జడ్చర్ల పట్టణంలోని మున్సిపాలిటీ ప్రాంగణం బతుకమ్మ సంబరాలతో పులకించిపోయింది. జడ్చర్ల మున్సిపాలిటీ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు జనంపల్లి శశికళ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మున్సిపాలిటీ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. సంప్రదాయబద్ధంగా పేర్చిన పూల బతుకమ్మల చుట్టూ మహిళలు గుమిగూడి పాటలు పాడుతూ, చప్పట్లతో లయబద్ధంగా ఆడుతూ పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

### తెలంగాణ ఆత్మ.. బతుకమ్మ పండుగ!

బతుకమ్మ అంటే కేవలం పూలను పేర్చి పూజించే వేడుక మాత్రమే కాదు.. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతిరూపం. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను అందంగా పేర్చి గౌరమ్మను పూజించడం ఈ పండుగ ప్రత్యేకత. ప్రకృతితో మమేకమై జీవించాలనే సందేశంతో పాటు, కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుకునే ఆడపడుచుల మనసుల్లో బతుకమ్మకు ప్రత్యేకమైన స్థానం ఉంది.ఈ పండుగలో కులమతాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా మహిళలు ఒకచోట చేరి ఆనందాన్ని పంచుకుంటారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ కలిసి పాటలు పాడుతూ, ఆటలాడుతూ తమ బాల్య జ్ఞాపకాలను నెమరువేసుకుంటారు. పుట్టింటి అనుబంధాలను గుర్తుచేసుకుంటూ, ఆత్మీయతను పంచుకుంటూ బతుకమ్మను తమ జీవితాల్లో అంతర్భాగంగా భావిస్తారు.

### మహిళల ఐక్యతకు ప్రతీకగా వేడుకలు

జడ్చర్ల మున్సిపాలిటీ ప్రాంగణంలో జరిగిన బతుకమ్మ సంబరాలు మహిళల ఐక్యతకు, సామూహిక ఆనందానికి ప్రతీకగా నిలిచాయి. రోజువారీ పనులు, కుటుంబ బాధ్యతలతో నిత్యం బిజీగా ఉండే మహిళలు పండుగ సందర్భంగా ఒకచోట చేరి ఉత్సాహంగా గడిపారు. సంప్రదాయ పాటలు పాడుతూ, బతుకమ్మల చుట్టూ తిరుగుతూ చేసిన సందడి ప్రాంగణమంతా పండుగ వాతావరణాన్ని నింపింది. పండుగలు మనుషుల మధ్య అనుబంధాలను బలోపేతం చేయడంతో పాటు, మన సంస్కృతిని భావితరాలకు అందించే వేదికలుగా నిలుస్తాయి. ముఖ్యంగా బతుకమ్మ వంటి పండుగలు మహిళల్లో ఆత్మీయతను పెంపొందించడమే కాకుండా, తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెబుతాయి. నేటి ఆధునిక జీవనశైలిలోనూ ఇటువంటి సంప్రదాయాలను కొనసాగించడం మన సంస్కృతిని కాపాడుకోవడానికి ఎంతో అవసరం.

### సంప్రదాయాల పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

బతుకమ్మ వేడుకల్లో జనంపల్లి శశికళ రెడ్డి పాల్గొనడం మహిళల్లో ఉత్సాహాన్ని నింపింది. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ పండుగను ప్రత్యేకంగా, ఘనంగా నిర్వహిస్తారని, మహిళలంతా ఏకమై పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఈ వేడుకల్లో పాల్గొనడం మన సంప్రదాయంలోని ప్రత్యేకత అని ఆమె పేర్కొన్నారు. పూలతో పేర్చిన బతుకమ్మ చుట్టూ మహిళలంతా ఒక్కటిగా చేరడం వెనుక కేవలం పండుగ ఆనందమే కాకుండా, పరస్పర అనుబంధం, ఐక్యత, ఆత్మీయత వంటి విలువలు దాగి ఉన్నాయి. ఈ సంప్రదాయాలను రాబోయే తరాలకు కూడా అందేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

### మున్సిపాలిటీ ప్రాంగణంలో పండుగ సందడి

మున్సిపాలిటీ ఆవరణలో నిర్వహించిన ఈ వేడుకల్లో మున్సిపల్ కమిషనర్ రజిత రెడ్డి, సంధ్య, మాజీ ఎంపీటీసీ లక్ష్మమ్మ, నిర్మలతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మహిళల ఆటపాటలు, బతుకమ్మల సందడి మధ్య వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. మొత్తంగా జడ్చర్ల మున్సిపాలిటీ ప్రాంగణంలో జరిగిన బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని మరోసారి చాటిచెప్పాయి. పూలలో ప్రకృతి అందం.. పాటల్లో తెలంగాణ మట్టి పరిమళం.. మహిళల చిరునవ్వుల్లో పండుగ ఆనందం.. అందరి కలయికలో ఆత్మీయత కనిపించాయి. బతుకమ్మ పండుగ అనేది ఒకరోజు సంబరం మాత్రమే కాదు.. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని ఈ వేడుకలు మరోసారి గుర్తుచేశాయి.



# మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి




**కొత్తకోట, అక్టోబర్ 16 (మనం న్యూస్):** మండల పరిధిలోని అప్పరాల గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేశి మొగులన్న తల్లి దేశి శాంతమ్మ మరణించిన విషయం స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా తెలుసుకొని గ్రామానికి చేరుకొని మృతురాలి పార్థివ దేహానికి దేవరకద్ర శాసనసభ్యులు జి. మధుసూదన్ రెడ్డి సతీమణి జి. కవిత మధుసూదన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కొత్తకోట మండల అధ్యక్షులు నాగారపు బీచ్పల్లి యాదవ్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు అప్పరాల సర్పంచ్ మాసన్న, నాటేల్లి సర్పంచ్ ప్రశాంత్, అప్పరాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అబ్దుల్లా, గ్రామ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కాళికాదేవి పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రాణప్రతిష్ట



**కొత్తకోట, అక్టోబర్ 16 (మనం న్యూస్):** దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా మండలం పరిధిలోని కనిమెట్ట గ్రామ ఆరాధ్య దైవం, గ్రామ దేవత అయిన శ్రీ కాళికాదేవి పంచలోహ ఉత్సవ విగ్రహ ప్రాణప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.బ్రహ్మశ్రీ గోపి గురుస్వామి, రాజశేఖర్ అయ్యగారి ఆధ్వర్యంలో ప్రాణప్రతిష్ట కార్యక్రమం జరిగింది. శ్రీ కాళికామాత పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, గుంత సహన సురేష్ దంపతులు సమకూర్చారు.ఈ సందర్భంగా గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకి సేవ కార్యక్రమం, తీర్థ ప్రసాదాలు, అన్న వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామచంద్ర యాదవ్ దంపతులు, వార్డు సభ్యులు , గ్రామ పెద్దలు, గ్రామ భజన భక్త బృందం, మహిళలు, యువకులు, అమ్మవారి పూజారులు నాయిని మంజుల పెద్ద సైదులు దంపతులు, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ భవాని దేవి అమ్మవారికి సారె సమర్పించిన రచ్చకట్ట మహిళలు



**-పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామం నుండి మహిళలు అమ్మవారికి వడిబియ్యం, నైవేద్యం సమర్పించారు.**

**కొత్తకోట, అక్టోబర్ 16 (మనం న్యూస్):** పట్టణ కేంద్రంలోని శ్రీ భవాని శంకర దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీ అంబ భవాని దేవి అమ్మవారికి ఆరో రోజు శుక్రవారం నాడు శ్రీ సరస్వతిదేవి గా అమ్మ వారికి కొత్తకోట పట్టణ రచ్చకట్ట రెడ్డి మహిళా సంఘం ఆధ్వర్యంలో రచ్చకట్ట నుండి భవాని అమ్మవారి ఆలయం వరకు అంగ రంగ వైభవంగా మేళతాళాలతో శోభయాత్రగా వెళ్లి వేద పండితుల మంత్రోచ్ఛాణల నడుమ ప్రత్యేక పూజలతో అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారితో ఉన్న ఆత్మీయ అనుబంధానికి, భక్తికి నిదర్శనం తో అమ్మవారికి సారే సమర్పించి దివ్య ఆశీస్సులు పొందడం జరిగింది. కొత్తకోటలో మహిమాన్వితంగా వెలుగొందుతున్న తల్లి కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి అయినా అంబ భవాని మాత కృప కటాక్షాలతో పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ అమ్మవారికి సారే సమర్పించిన మహిళలు. ఈ కార్యక్రమంలో రెడ్డి మహిళా సంగం వారి కుటుంబ సభ్యులతో కలసి పాల్గొన్నారు. అలాగే పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామ మహిళలు అమ్మవారికి ఇష్టమైన అనేక రకమైన 51 రకాల పిండి వంటలు నైవేద్యంగా తయారు చేసుకుని వడి బియ్యం తీసుకొని గ్రామోత్సవంగా మంగళ వాయిద్యాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకుని కుంకుమార్చన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# మంగంపల్లి దళితులకు అండగా లంబాడి హక్కుల పోరాట సమితి

- **నిందితులను వెంటనే అరెస్టు చేయాలి**
- **రాష్ట్ర అధ్యక్షులు అంగోత్ రాజ్ కుమార్**



**పెద్దమందడి అక్టోబర్ 17 (మనం ప్రతినిధి)** పెద్దమందడి మండలంలోని మంగంపల్లి గ్రామంలో దళితులపై జరిగిన కులవివక్ష ఘటనలో బాధిత మాసాని సుధీర్ కుటుంబానికి అండగా ఉంటామని లంబాడి హక్కుల పోరాట సమితి భరోసా కల్పించింది. ఆలయ పునర్నిర్మాణంలో దర్శనానికి వెళ్లిన సుధీర్ కుటుంబాన్ని వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాజవర్ధన్ రెడ్డిలు కులం పేరుతో దూషించి అవమానించారని, 12న జరిగిన ఈ ఘటనపై ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడాన్ని సమితి తీవ్రంగా ఖండించింది. రాష్ట్ర అధ్యక్షులు ఆంగోతు రాజ్ కుమార్, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ నాయక్ బాధిత కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించి బాధిత కుటుంబానికి ధైర్యం కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న సుధీర్ కుటుంబాన్ని ఒక వర్గం సాంఘిక బహిష్కరణ చేస్తూ వారి ట్రాక్టర్ ను కూడా పనికి రానీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే అధికారాన్ని అడ్డుపెట్టుకొని నిందితులను కాపాడుతూ చోద్యం చూస్తున్నారని, రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ఎమ్మెల్యేకు పదవిలో ఉండే అర్హత లేదని మండిపడ్డారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి రిమాండ్ చేయాలని డీఎస్పీకి వినతి ఇచ్చామని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమం చేస్తామని, దళితులకు ఆలయ ప్రవేశం కల్పించే వరకు ఆలయ పునర్నిర్మాణ పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొడ్ల రాములు, రాంబాబు నాయక్, ధర్మా నాయక్, బాబు నాయక్, టీక్యా నాయక్, రమేష్ నాయక్, చందు నాయక్, వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు.



# అలకల వెనుక ఆత్మీయత..అలసిన అమ్మకు విశ్రాంతి

- **అలిగిన బతుకమ్మ..ప్రత్యేక ముచ్చట్లు**

**ఊరుకొండ సెప్టెంబర్ 15 (మనం న్యూస్ ):** స్థానిక మండల పరిధి వ్యాప్తంగా గ్రామాలలో బతుకమ్మ సంబరాలు ప్రతి దినం అంబరాన్ని తాకేలా కొనసాగుతున్నాయి.ఈ నేపథ్యంలో శుక్రవారం అలిగిన బతుకమ్మ సంబరాలు తంగేడు,గునుగు,చామంతుల చుట్టూ తొమ్మిది రోజుల పాటు సాగే తెలంగాణ పూల జాతర బతుకమ్మ సంబురం.పల్లె,పల్లెనా పడచుతుల ఆటపాటలు,చప్పట్ల సవ్వడులతో కోలాహలంగా సాగే ఈ పూల పండగలో ఆరో రోజుకు ఒక విలక్షణమైన,విలక్షణమైన ముచ్చట ఉంది.అదే ఆశ్వయుజ శుద్ధ పంచమి నాడు వచ్చే 'అలిగిన బతుకమ్మ అలసిన బతుకమ్మ.

## అలక వెనుక అంతరార్థం..ఓలాల సింగారం.

రోజూ పొద్దుగాలనే లేచి,అడవి బాట పట్టి పూలను తెచ్చి,గోపురం తీరుగా పేర్చి,సాయంత్రం వేళ చెరువు గట్టున చేరి 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అంటూ ఆడే ఆడబిడ్డల శ్రమను గుర్తించిన రోజు ఇది.ప్రకృతిని పూజించే పండుగలో అమ్మవారే స్వయంగా అలిగి,ఆడపడుచులకు విశ్రాంతిని ప్రసాదించినట్లుగా ఈ రోజును భావిస్తారు.'పూలు పేర్చని రోజైనా,మనసుల్లో జ్ఞాపకాల పూలు విరబూసే రోజు! పాటలు పాడకపోయినా..పాత ముచ్చట్ల మధురిమలు గుర్తుకొచ్చే రోజు!'

## పురాణ గాథలు..జానపద నమ్మకాలు.

జానపద కథల ప్రకారం పూర్వకాలంలో బతుకమ్మను పేర్చే సమయంలో అనుకోకుండా మాంసం ముద్ద తగిలి అపచారం జరిగిందని,అందుకే అమ్మవారు అలిగి ఏదీ ఆరగించలేదని పల్లెల్లో చెబుతారు.అందుకే ఈ రోజు పూలను కోయరు,బతుకమ్మలను పేర్చరు,ఎలాంటి నైవేద్యాలూ సమర్పించరు.మరోవైపు దేవీ భాగవతం ప్రకారం,రాక్షస సంహారం చేసి అలసిపోయిన జగన్మాతకు విశ్రాంతినిచ్చే రోజుగా దీనిని 'అలసిన బతుకమ్మ' అని కూడా పిలుస్తారు.

## బంధాల మాధుర్యం..ఆత్మీయ సందేశం.

ఈ రోజు ఆటపాటల హడావుడి లేకపోయినా,పల్లెల్లో ఆత్మీయతలు పలకరిస్తాయి.పెండ్లిళ్లయి అత్తగారింటికి వెళ్లిన ఆడబిడ్డలు,చిన్ననాటి స్నేహితులు ఒకచోట చేరి కష్టసుఖాలు ముచ్చటించుకుంటారు.ఆడంబరాల కన్నా అనుబంధాలే మిన్న అని చాటిచెప్పే రోజిది.అలకల్లోనూ ఆప్యాయతను,నిశ్శబ్దంలోనూ సాంస్కృతిక వైభవాన్ని నింపుకున్న 'అలిగిన బతుకమ్మ' తెలంగాణ సంస్కృతిలోని సహజత్వానికి,ఆత్మీయతకు సజీవ సాక్ష్యం....



# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



▸▸ అధికారులకు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు

**ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 16 (మనం బ్యూరో):** ఈ నెల 20వ. తేదీన నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు దసరా ఉత్సవాల్లో పాల్గొనన్నున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రానున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా అధికారులకు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు జారీ చేశారు. స్వగ్రామమైన రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని జిల్లా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం కొండారెడ్డిపల్లి గ్రామాన్ని సందర్శించి ఏటీసీ కేంద్ర నిర్మాణ స్థలం, భూగర్భ మరుగునీటి శుద్ధి కేంద్రాన్ని నూతనంగా ప్రారంభించనున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయంతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించి ఆయా శాఖలు చేపట్టాల్సిన పనులు, నిర్వర్తించాల్సిన బాధ్యతలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ...., ముఖ్యమంత్రి పర్యటనకు అవసరమైన ఏర్పాట్లన్నింటినీ ముందస్తు ప్రణాళికతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, పర్యటన ప్రాంగణం సిద్ధం చేయడం, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, రవాణా సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ప్రతి శాఖకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. పనుల్లో జాప్యం జరగకుండా నిర్దేశిత గడువులోగా ఏర్పాట్లను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఏర్పాట్లలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. శాఖల వ ుధ్య సమన్వయంతో పనిచేస్తూ పర్యటనను సజావుగా నిర్వహించేందుకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని డిఎస్పిని కలెక్టర్ ఆదేశించారు.



**పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు....**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొండారెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ), అండర్గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా నూతనంగా మంజూరైన మూడు ఏటీసీ కేంద్రాల నిర్మాణ పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.ఈ కార్యక్రమాలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లన్నింటినీ ముందుగానే పూర్తి చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని భద్రత, మౌలిక సదుపాయాలు, ఇతర ఏర్పాట్ల విషయంలో ప్రత్యేక అప్రమత్తత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కొండారెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ వేంకటయ్య, ఉప సర్పంచ్ వేమారెడ్డి, గ్రామ నాయకులు, మండల, నియోజకవర్గం, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ కాలనీలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ





**వనపర్తి, అక్టోబర్ 17 (మనం ప్రతినిధి):** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో శారద, కృష్ణయ్యల ఆధ్వర్యంలో ప్రతిష్టించిన దుర్గామాత ఆరవ రోజు శుక్రవారం మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చి అభయహస్తం చూపింది. ఐశ్వర్యం, సౌభాగ్యం, అష్టలక్ష్ములకు అధిదేవత అయిన మహాలక్ష్మి రూపంలో దర్శనమివ్వడం వల్ల భక్తులు తరించారని, అమ్మవారి చల్లని చూపు పడితే సకల సంపదలు, సుఖ సంతోషాలు చేకూరుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణం, పూలతో అష్టోత్తరం, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఎర్రటి పూలు, పసుపు కుంకుమలతో అర్చన చేయడం, కనకధారా స్తోత్ర పఠనం చేయడం వల్ల అమ్మవారి అనుగ్రహం పరిపూర్ణంగా లభిస్తుందని పూజారులు తెలిపారు. ఉదయం నుంచే భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

# బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.....!



▸▸ తిరొక్క పూలతో ఘనంగా బతుకమ్మ సంబరాల వేడుకలు....

▸▸ సంప్రదాయబద్ధంగా మహిళా ఉద్యోగులు బతుకమ్మ వేడుకల్లో....

▸▸ పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వేడుకలు...

**ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 16 (మనం బ్యూరో):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఆయా శాఖకు చెందిన ఉద్యోగులు, మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొని తీరొక్క రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి అలంకరించారు. మహిళలు బతుకమ్మ ఆటపాటలతో సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, పూల వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. మహిళా ఉద్యోగులు సంప్రదాయ దుస్తులు ధరించి, బతుకమ్మల చుట్టూ చేరి పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ వేడుకలు ఉద్యోగుల్లో ఐక్యతను, సోదరభావాన్ని పెంపొందించడంతో పాటు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి. 'తోడు బతుకమ్మ తొందరగా రావమ్మ.. మా తల్లి బతుకమ్మ మమ్మల్ని ఆదరించ రావమ్మ' అంటూ బతుకమ్మ పాటలతో కార్యాలయ ప్రాంగణం మార్మోగింది. పూల పండుగైన బతుకమ్మను భక్తిశ్రద్ధలతో కొలుస్తూ, ప్రకృతిని ఆరాధించే తెలంగాణ సంప్రదాయాన్ని ఉద్యోగులు ఘనంగా చాటిచెప్పారు. బతుకమ్మ, దసరా పండుగలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు నిదర్శనమని, ప్రజల్లో ఆనందోత్సాహాలను నింపే పండుగలని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సంకల్పంతో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలు ఉద్యోగుల్లో నూతనోత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో డివిఏహెచ్ఓ డాక్టర్ బి. జ్ఞాన శేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) డాక్టర్ ఎస్.ఏ.ఎల్. నరసింహ, పశువైద్యులు డాక్టర్ కల్పన, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ జీవిత, డాక్టర్ నవ్యశ్రీ, డాక్టర్ పల్లవి, డాక్టర్ ప్రణీతతో పాటు పశువైద్య సహాయకులు శ్రావణి, సల్మా, వనజ, లలిత, శైలజ, విజయలక్ష్మి, జ్యోతి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ సంబరాలు



▸▸ మహిళా పోలీసుల సంప్రదాయ నృత్యాలతో మార్మోగిన పోలీస్ ప్రాంగణం

▸▸ పాల్గొన్న ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్

నాగర్ కర్నూల్,( మనం న్యూస్ అక్టోబర్ 16 ): నాగర్ కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పండుగ బతుకమ్మ సంబరాలను శుక్రవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ ఐపీఎస్ కుటుంబ సమేతంగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళా పోలీస్ సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు వేస్తూ ఆటపాటలతో వేడుకను అంబరాన్నంటించారు అనంతరం ఎస్పీ డా. సంగ్రామ్ సింగ్ జి. పాటిల్ మాట్లాడుతూ... బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవనానికి ప్రతీక అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ, వాటి గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. 24 గంటలు ప్రజల భద్రత కోసం విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా సిబ్బందిలో ఐక్యత, స్నేహభావం మరింత పెరుగుతుందని అన్నారు. మహిళా పోలీసుల ఉత్సాహం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, డీఎస్పీలు పల్లె శ్రీనివాస్, బుర్రి శ్రీనివాస్, ఆర్ఐ జగన్ తో పాటు జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రబీలో ఆరుతడి పంటలే సాగు చేయాలి

- విబిజి రాంజీలో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేయాలి
- ఆధార్ కార్డులు, బర్త్ సర్టిఫికెట్ లు లేని పిల్లలకు ప్రత్యేక డ్రైవ్
- జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 16 (మనం బ్యూరో):** ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసినందున రబీ సీజన్ లో రైతులు తమ బోరు, బావుల్లో నీటి లభ్యతను బట్టి ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వెబ్ ఎక్స్ ద్వారా జిల్లా కలెక్టర్ పలువురు అధికారులతో కలెక్టర్ సమావేశమై వివిధ అంశాలపై మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీ, డిజిటల్ క్రాప్ సర్వే పనులు పూర్తయ్యేలా సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు ప్రతినిత్యం తన పరిధిలోని రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఎక్కడైనా పంటలు ఎండిపోతే పూర్తిస్థాయి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుందన్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. విబిజి రాంజీలో జల సంరక్షణ పనులకు ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. పంట కుంటలు, ఇంకుడు గుంతలు పెద్ద ఎత్తున నిర్మించాలని ఆదేశించారు. ఆయా గ్రామ పంచాయతీలలో చేపట్టాల్సిన పనులపై సర్పంచులు, సంబంధిత అధికారులు సమన్వయ సమావేశాలు నిర్వహించుకొని ప్రాధాన్యత క్రమంలో ఆయా పనులను చేపట్టాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలో చేపట్టిన పనులపై ఈనెల 30వ. తేదీలోగా నివేదిక పంపాలని ఆదేశించారు. ఎల్ నినో నేపథ్యంలో రైతు కూలీలకు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులు కల్పించాలని సూచించారు. క్షేత్ర సహాయకుల మూమెంట్ రిజిస్టర్ ను ఎంపీడీవోలు ప్రతి నెల తమకు పంపాలని ఆదేశించారు.

## .ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం కావాలి....

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం అయ్యేలా సంబంధిత మండలాల ఎంపీడీవోలు, ఇతర అధికారులు తరచు పర్యవేక్షణ చేస్తూ లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ తాగు నీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అవసరమైన చోట బోర్ వెల్స్ రీఛార్జ్, మోటార్ల రిపేర్, తదితర పనులను చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వం గొర్రెలు, మేకలకు బీమా పథకాన్ని వర్తింపచేస్తున్నందున పాడి రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణతై మూడేళ్లు పూర్తయిన వారు గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేలా దరఖాస్తు చేసుకునేందుకు ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్స్ లేని పిల్లలకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి ఎన్రోల్మెంట్ చేయించాలని ఆదేశించారు. ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించినందున ప్రతి శుక్రవారం విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని, ఎక్కడ కూడా ఫుడ్ పాయిజన్ కేసులు కాకుండా పర్యవేక్షించాలన్నారు. చైల్ సేఫ్టీ ఉపాధ్యాయులను కూడా నియమించామని, ఆయా గురుకులాలు, కేజీబీవీలు, వసతిగృహాల విద్యార్థుల సంరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు ప్రతి మంగళవారం తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను సందర్శించాలన్నారు. రీ సర్వే పనులను వేగవంతం చేయాలని, లైసెన్స్ సర్వేయర్ల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అలసత్వం వహించే వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను జిల్లాలో విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో చేపట్టిన అంగన్వాడి కేంద్రాలు, పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో మంజుల, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.






# ఘనంగా దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు



- రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు
- రాష్ట్ర ప్రజల సంక్షేమం,ఎల్నినో ప్రభావాన్ని అధిగమించే శక్తిని రాష్ట్ర ప్రభుత్వానికి కలగాలని అమ్మవారి పూజలు
- రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడల యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి

**ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 16 (మనం బ్యూరో):** ఎల్నినో ప్రభావం నుంచి రైతాంగం, ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగి, సమృద్ధిగా వర్షాలు కురిసి తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. శుక్రవారం దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అలంపూర్లోని శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున కుటుంబసమేతంగా శ్రీ జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన మంత్రికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా శ్రీ బాల బ్రహ్మేశ్వర స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించడంతో పాటు విఘ్నేశ్వర స్వామికి అభిషేకం చేశారు. అనంతరం శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేసి ఆశీర్వచనాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ..శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామివార్ల దసరా శరన్నవరాత్రుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తనకు ఎంతో పుణ్యప్రదమైన అవకాశమని పేర్కొన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వానికి అమ్మవారు మరింత శక్తి, సామర్థ్యాలను ప్రసాదించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఎల్నినో ప్రభావాలు తగ్గి,రాష్ట్రంలో అనుకూల వాతావరణ పరిస్థితులు నెలకొని,సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని శ్రీ జోగులాంబ అమ్మవారిని ప్రార్థించినట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. రైతాంగం మంచి దిగుబడులు సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. వ్యవసాయ రంగం సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ప్రకృతి ప్రతికూల ప్రభావాల నుంచి ఉపశమనం పొందాలని అమ్మవారి ఆశీస్సులు కోరినట్లు పేర్కొన్నారు. రాష్ట్రం సస్యశ్యామలంగా మారి, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, రాష్ట్ర గొర్రెలు, మేకలు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ సరిత,ఆలయ ఈవో దీప్తి,స్థానిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఎల్టీ లైన్ తెగి పంచాయతీ మల్టీ వర్కర్ దుర్మరణం

**అచ్చంపేట, అక్టోబర్ 16 (మనం న్యూస్):** అచ్చంపేట మండలం బొమ్మనపల్లి గ్రామంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామపంచాయతీలో గత ఎనిమిదేళ్లుగా మల్టీ పర్పస్ వర్కర్గా పనిచేస్తున్న సౌట బాలయ్య (45) విధి నిర్వహణలో విద్యుత్ షాక్కు గురై మృతి చెందాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గురువారం మధ్యాహ్నం బాలయ్య మసీదు సమీపంలో గ్రామపంచాయతీ పనులు నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మసీదు పక్కనే ఉన్న చెట్టుపై కోతుల గుంపు గంతులు వేస్తూ ఒకదానితో ఒకటి కొట్లాడుకోవడంతో చెట్టు నుంచి కోతులు విద్యుత్ లైపై పడినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఎల్టీ లైన్ వైరు ఒక్కసారిగా తెగి బాలయ్య చేతిపై పడింది. లైవ్ కరెంట్ ఉండటంతో తీవ్ర విద్యుత్ షాక్కు గురైన బాలయ్య అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే బాలయ్యను అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



## అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ

బాలయ్య ఎనిమిదేళ్లుగా గ్రామపంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా, వాటర్మ్యాన్గా నిజాయితీగా విధులు నిర్వహిస్తున్నాడని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ లైన్లకు చెట్ల కొమ్మలు తగులుతున్న విషయాన్ని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్

విధి నిర్వహణలో మృతి చెందిన బాలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. కుటుంబానికి రూ.15 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలని, మృతుని భార్యకు గ్రామపంచాయతీలో కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పించాలని కోరారు. బాలయ్య పిల్లల చదువు బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అలాగే బొమ్మనపల్లి గ్రామంలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ లైన్లు, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని, కోతుల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ ఘటనపై అచ్చంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలయ్య అంత్యక్రియలు గ్రామంలోనే నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# హమాలీలు,స్వీపర్లకు రెండు జతల యూనిఫాం దుస్తులు పంపిణీ



## ⏩ జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ఉమ్మడి మహబూబ్ నగర్, అక్టోబర్ 16 (మనం బ్యూరో):** దసరా పండుగను పురస్కరించుకుని హమాలీలు, స్వీపర్లకు యూనిఫాం దుస్తులను అందజేసిన జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,...దసరా పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా జరుపుకోవాలని పౌర సరఫరాల సంస్థ ప్రతి ఏటా ఏం.ఎల్.ఎస్. పాయింట్లో హమాలీలు, స్వీపర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి బోనస్, దుస్తులు అందజేస్తున్నదన్నారు. జిల్లాలోని గద్వాల, అలంపూర్, అయిజ, మనోపాడు ఎం.ఎల్.ఎస్. పాయింట్లలో విధులు నిర్వహిస్తున్న 34 మంది హమాలీలు, నలుగురు స్వీపర్లు కలిపి మొత్తం 38 మందికి ఈ ఏడాది దసరా ప్రోత్సాహకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ రెండు జతల యూనిఫాం దుస్తులను నేడు పంపిణీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి హమాలీకి, స్వీపర్కు రూ.8,500 ప్రోత్సాహక నగదు, స్వీట్ బాక్సు బదులుగా రూ.1,000 నగదు ఇప్పటికే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. యూనిఫాం కుట్టు ఖర్చుల నిమిత్తం హమాలీలకు రూ.1,800 చొప్పున, స్వీపర్లకు రెండు బ్లౌజుల కుట్టు ఖర్చుల కోసం రూ.800 చొప్పున నగదును కూడా ముందుగానే జమ చేసినట్లు వివరించారు. హమాలీలు,స్వీపర్లు నిరంతరం కష్టపడి పనిచేస్తూ తమ విధుల పట్ల అంకితభావంతో వ్యవహరిస్తున్నారని కలెక్టర్ అభినందించారు. ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో కలిసి దసరా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వామి కుమార్,హమాలీలు, స్వీపర్లు,సంబంధిత శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రూ.9.68 కోట్ల ప్రభుత్వ ధాన్యం మాయం

## ⏩ నాగర్ కర్నూల్ లో భారీ కుంభకోణం బట్టబయలు!
## ⏩ మహాలక్ష్మి మిల్లులో 3,774 టన్నులు గల్లంతు.. 14 మందిపై కేసు

**నాగర్ కర్నూల్,( మనం న్యూస్ అక్టోబర్ 16):** నాగర్ కర్నూల్ జిల్లా మంతటి సమీపంలోని మహాలక్ష్మి పార్ బాయిల్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ధాన్యం 3,774.818 మెట్రిక్ టన్నులు (94,370 బస్తాలు) మాయమైంది. దీని విలువ రూ.9.68 కోట్లు. సివిల్ సప్లైస్, విజిలెన్స్ అధికారుల సంయుక్త తనిఖీల్లో ఈ కొరత బయటపడింది. 2022-23, 2024-25, 2025-26 సీజన్ల కస్టమ్ మిల్లింగ్ ధాన్యంలో ఈ అక్రమం జరిగింది. జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ దండు రాజేందర్ ఫిర్యాదుతో మిల్లు నిర్వాహకులు ఆకుతోట సాయిబాబు, సుదర్శన్ సహా 14 మందిపై కేసు నమోదు అయ్యింది. ధాన్యం దారి మళ్లిందా అనే కోణంలో విచారణ జరుగుతోంది.



# బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమం

## ⏩ జోగులాంబ గద్వాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, నిష్కా పాత్రుడు

**ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 16 (మనం బ్యూరో):**జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలంలోని బింగిడొడ్డి గ్రామ అంగన్వాడీ కేంద్రంలో బాల కార్మిక వ్యవస్థ అదేవిదంగా బాల్య వివాహాల నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిష్కా పాత్రుడు శుక్రవారం మాట్లాడుతూ,..బాల కార్మిక వ్యవస్థ మరియు బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. ప్రతి బాలబాలికకు విద్యను పొందే హక్కు ఉందన్నారు. పిల్లలను పనుల్లో పెట్టకుండా పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహాలు బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తుకు ఆటంకం కలిగిస్తాయని వివరించారు. బాల్య వివాహాల నివారణకు తల్లిదండ్రులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాల నిర్వహణ, ప్రోత్సాహం అరికట్టడంలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఆమె పేర్కొన్నారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ఎక్కడైనా బాల కార్మికులు లేదా బాల్య వివాహాల గురించి తెలిసినట్లయితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా, అర్హులైన మహిళలు, పిల్లలు మరియు ఇతర అర్హతగల వ్యక్తులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహా, న్యాయవాది సేవలు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. ఉచిత న్యాయ సహాయం కోసం జాతీయ న్యాయ సేవల ప్రాధికార సంస్థ (ౖాఅఔఖిఅ) టోల్ఫ్రీ నంబర్ 15100 కు ఫోన్ చేయవచ్చని సూచించారు. అలాగే, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై వేధింపులు లేదా ఇతర బాలల రక్షణ సమస్యలు ఎదురైనప్పుడు తక్షణ సహాయం కోసం చైల్ హెల్ప్లైన్ 1098 కు సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్ను సంప్రదించవచ్చని తెలిపారు. ...జిల్లా సంక్షేమ అధికారి సునంద మాట్లాడుతూ,... బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు, బాల్య వివాహాలను అరికట్టేందుకు తల్లిదండ్రులు, గ్రామస్థులు మరియు అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి బాలబాలికకు విద్య, రక్షణ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి నరసింహ, బాలల సంక్షేమ కమిటీ కౌన్సిలర్ జయన్న, గ్రామ సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి రాధా గోపాల్, ఉప సర్పంచ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

